దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



వార్తాప్రభ
RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ

SINCE: 1984
చైతన్య కాలేజ్
Cell: 93908 22625
ONE SITTING (For Discontinued)
B.Tech, M.Tech, Diploma
M.B.A, M.C.A, M.Sc, M.A.
B.A, B.Com, B.Sc, B.B.A,
U.G.C. Recog. Universities
10th & Inter TOSS / APOSS / NIOS
డైరెక్టర్: బి.వి. త్రినాథ్ M.A, M.Ed, M.Phil, L.L.B



విజయవాడ VIJAYAWADA | సంపుటి : 25 Vol.No : 25 | సంచిక : 101 Issue No : 101 | ది. 21-7-2026 Date : 21-7-2026 | మంగళవారం Tuesday | పేజీలు : 8 Pages : 8 | వెల : రూ.1/- Rs.1/-

# ఉత్తరాంధ్ర మణిహారంగా భోగాపురం ఎయిర్ పోర్టు

**● ఎయిర్ పోర్టుతో పాటు జీఎమ్మార్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ఏవియేషన్ హబ్-యూనివర్శిటీ, ఎడ్యుసిటీలను ప్రారంభించనున్న ప్రధాని ● ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు సమీక్ష**



**అమరావతి,జూలై 20 (వార్తాప్రభ) :** భోగాపురంలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ఉత్తరాంధ్రకు మణిహారంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. ఆగస్టు 1 తేదీన ప్రధాని మోదీ చేతుల మీదుగా ఈ అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభించనున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లపై సీఎం చంద్రబాబు ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఉత్తరాంధ్రలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవ వేడుకలను అత్యంత వైభవంగా, చారిత్రాత్మక ఘట్టంగా నిర్వహించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ప్రధాని మోదీకి ఉత్తరాంధ్ర ప్రజల సంస్కృతీ, సంప్రదాయాలను తెలుపుతూ థింసా, సవర, కొమ్ము కోయ తదితర సంప్రదాయ నృత్య రూపాలతో ఘన స్వాగతం పలకాలని తెలిపారు. ఆగస్టు 1 తేదీన విమానాశ్రయ పాసింజర్ టెర్మినల్ భవనాన్ని ప్రారంభించడంతో పాటు... జీఎంఆర్ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్, ఏవియేషన్ హబ్-యూనివర్సిటీతో పాటు జీఎంఆర్-మాన్సాస్ ఎడ్యుసిటీలను ప్రధాని మోదీ లాంఛనంగా ఆవిష్కరిస్తారని అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర మణి హారంగా నిలవనున్న ఈ విమానాశ్రయం లాజిస్టిక్ కేంద్రంగా గ్లోబల్ కనెక్టివిటీని అందిస్తూ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి ఒక గేమ్ ఛేంజర్‌లా మారుతుందని సీఎం స్పష్టం చేశారు.

**ఉత్తరాంధ్ర అంతటా వేడుకగా ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం..** ఈ ప్రాజెక్టు కోసం భూములిచ్చిన రైతులు, యజమానులను గౌరవించేలా వారికి ఒకమారు ఉచిత విమాన ప్రయాణ అవకాశం కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవం సందర్భంగా బహిరంగ సభను నిర్వహించాలని సూచించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యేక పార్కింగ్ స్లాట్లతో పాటు పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. సభకు వచ్చే వారి కోసం అల్పాహారం, భోజనం, తాగునీటి లాంటి సదుపాయాలు కల్పించాలన్నారు. రేపటి నుంచి జూలై 31 తేదీ వరకు అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం పై విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సీఎం సూచించారు. రానున్న పది రోజుల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లోని ప్రతి ఇంటా ఈ ప్రారంభోత్సవ వేడుక స్ఫూర్తి చేరేలా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అంతర్జాతీయ వేదికపై ప్రధాని మోదీ ప్రమోట్ చేస్తున్న అరకు కాఫీ బ్రాండింగ్ కూడా వేదికగా దీనిని మలచాలని సూచించారు. మంగళవారం నుంచి చేపట్టే కార్యక్రమాల్లో ఉత్తరాంధ్రకు చెందిన ప్రజాప్రతినిధులు అంతా హాజరు కావాలని సీఎం నిర్దేశించారు. ఈ సమీక్షకు హోం మంత్రి అనిత, సీఎస్ సాయి ప్రసాద్, ఐఅండ్ఐ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, సివిల్ ఏవియేషన్ అధికారులు, జీఎంఆర్ ప్రతినిధులు హాజరయ్యారు.

# సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ప్రైవేటీకరణ అంటూ దుష్ప్రచారం

**● డాక్యుమెంట్ రైటర్లకు ఉపాధి మార్గాలు చూపిస్తాం**
**● దీపం-2.0 లబ్దిదారులకు నిర్ధారిత తేదీల్లో నగదు జమ ● ఆర్టీజీఎస్ సమీక్షలో సీఎం చంద్రబాబు**



**అమరావతి, జూలై 20 (వార్తాప్రభ) :** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారంటూ కొందరు పని గట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారని... దీనిపై వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ సెంటర్లో సోమవారం వివిధ శాఖల పనితీరుపై సీఎం చంద్రబాబు సమీక్షించారు.

**సేవల సులభతరానికే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు..** సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ప్రైవేటీకరిస్తున్నారనే అంశం సమీక్షలో ప్రస్తావనకు వచ్చింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ..."ప్రజలకు మెరుగైన రిజిస్ట్రేషన్ సేవలందించేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. రిజిస్ట్రేషన్ సేవలను మరింత సులభతరం చేసేలా రిజిస్ట్రేషన్ సేవా కేంద్రం-RSఖలను ఏర్పాటు చేస్తున్నాం. ఇది ప్రైవేటీకరణ ఎంత మాత్రమూ కాదు. పాస్ పోర్టు సేవా కేంద్రాల తరహాలోనే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలు పని చేస్తాయి. పాస్ పోర్టు సేవా కేంద్రాల పనితీరు ఏ విధంగా జరుగుతుందో... ఆ తర్వాత ప్రక్రియ ఏ విధంగా జరుగుతుందో వివరించండి. పాస్ పోర్టు సేవా కేంద్రాలు అందుబాటులోకి వచ్చాక పాస్ పోర్టు ప్రాసెసింగ్ అనేది చాలా సులువైంది. ఇదే తరహాలో రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల పనితీరు ఉంటుంది. అయితే రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల విషయంలో కొందరు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తున్నారు. ప్రజలకు వాస్తవాలు వివరించే బాధ్యతను అధికారులు తీసుకోవాలి. రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల వల్ల కలిగే లాభాలను వివరించాలి. అలాగే డాక్యుమెంట్ రైటర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. డాక్యుమెంట్ రైటర్ల ఉపాధికి ఇబ్బంది లేని విధంగా మార్గాలు చూపెడతాం. దీపం-2.0 పథక లబ్దిదారులకు ఇచ్చే సబ్సిడీని క్రమపద్ధతిలో ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ సబ్సిడీని నిర్ధారిత తేదీల్లో ఇచ్చే అంశాన్ని పరిశీలించాలి. ఈ అంశంపై పౌర సరఫరాల శాఖ-ఆర్థిక శాఖ అధికారులు సమన్వయం చేసుకోవాలి. దీనికి సంబంధించిన సాంకేతిక అంశాలను పరిశీలించి అమలు చేయాలి"అని సీఎం చంద్రబాబు ఆదేశించారు.

**లిటిగెంట్ పిటిషనర్లకు కౌన్సెలింగ్..**"లిటిగెంట్ పిటిషనర్లను ఏ విధంగా కట్టడి చేయాలి. ఎలాంటి ప్రజా ప్రయోజనం లేకుండా చేసే ఫిర్యాదు దారులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలి. రాష్ట్ర వ్యాప్తంగా 81 మంది లిటిగెంట్ పిటిషనర్లు ఉన్నట్టు గుర్తించాం. వీరు సరాసరి ఒక్కొక్కరు 246 పిటిషన్లు పెడుతున్నారు. వీరి వివరాలను జిల్లా కలెక్టర్లకు పంపించాలి. వారు పెట్టే అర్జీల్లో ప్రజా ప్రయోజనాలు ఉంటే వాటిని పరిశీలించాలి. ప్రభుత్వాన్ని, అధికారులను బద్నాం చేసే ఉద్దేశంతో పిటిషన్లు పెట్టే వారిని గుర్తించాలి. ఫిర్యాదుల పరిష్కారంలో ఆర్థికేతర సమస్యలను వెంటనే పరిష్కరించాలి. ప్రాధాన్యతల వారీగా ఆర్థిక సమస్యలను పరిష్కరిద్దాం. ఈ ఏడాది ఎల్ నినో ప్రభావం కారణంగా ప్రస్తుతం 49 శాతం లోటు వర్షపాతం ఉంది. ఈ ప్రభావం నుంచి బయటపడేసే ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలి. ఈ మేరకు రైతుల్లో అవగాహన కల్పించాలి. డ్రై క్రాప్స్ వేసేలా రైతులను ప్రోత్సహించండి. ఇదే సమయంలో వీబీ జీ రామ్ జీ పనులను పెద్ద ఎత్తున చేపట్టాలి. జలధార పనులకు వీబీ జీ రామ్ జీ పనుల్ని అనుసంధానం చేయాలి. ప్రజాభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకుని పని విధానం మార్చుకోవాలి. పరిపాలనా విధానాలను మెరుగుపరుచుకోవాలి. సమస్యలు ఉత్పన్నమయ్యాక చర్యలు తీసుకోవడంతోపాటు... ముందుగానే ఏయే సమస్యలు వస్తాయనే విషయాన్ని అంచనా వేసి.. దానికి అనుగుణంగా చర్యలు తీసుకోవాలి" అని ముఖ్యమంత్రి సూచించారు. ఈ సమీక్షలో సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఆపదలో అండగా... ఆర్టీసీ ఒకే కుటుంబం..!

**● "కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది : రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్" ● దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి రూ. 90.85 లక్షల ఆర్థిక సాయం అందించిన రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.**



**హైదరాబాద్,జూలై 20 (వార్తాప్రభ) :** టీజీఎస్ ఆర్టీసీ కేవలం ఒక రవాణా సంస్థ మాత్రమే కాదని... వేలది మంది ఉద్యోగుల ఉమ్మడి కుటుంబమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. నర్సంపేట ఆర్టీసీ డిపోకు చెందిన దివంగత డ్రైవర్ కోలా శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులు 'చేయూత' కార్యక్రమం ద్వారా స్వచ్ఛందంగా సేకరించిన రూ. 90,85,500 (తొంభై లక్షల ఎనభై ఐదు వేల ఐదు వందల రూపాయల) భారీ ఆర్థిక సహాయ చెక్కును సోమవారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శంకర్ కుటుంబ సభ్యులకు అందజేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్, ఎండీ వై.నాగిరెడ్డి ల చేతుల మీదుగా దివంగత డ్రైవర్ సతీమణి హేమలత, కుమారుడు హేమంత్, కుమార్తె షాలినిలకు ఈ చెక్కును అందజేసి సంస్థ తరఫున పూర్తి భరోసా కల్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ కార్మికుల కోసం ప్రాణత్యాగం చేసిన దివంగత కోల శంకర్ కుటుంబానికి ఆర్టీసీ ఉద్యోగులందరూ అండగా నిలవడం వారి మానవత్వానికి నిదర్శనమన్నారు. శంకర్ ఆసుపత్రిలో ఉన్న సమయంలో అర్ధరాత్రి వేళ స్వయంగా వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఆ కుటుంబానికి ప్రజా ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, అందులో భాగంగానే దివంగత శంకర్ కుమారుడు హేమంత్‌కు ఆర్టీసీలో ఉద్యోగం కల్పిస్తున్నామని, అలాగే ఆ కుటుంబానికి ఇల్లు కూడా మంజూరు చేశామని ప్రకటించారు. గత ప్రభుత్వాల కాలంలో ఆర్టీసీ కార్మిక సంఘాలను ఎత్తివేసి, నిరంకుశంగా వ్యవహరించారని మంత్రి విమర్శించారు. అయితే రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆర్టీసీలోని ప్రతి సమస్యను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ వస్తున్నామని చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కల్పించే మహాలక్ష్మి పథకం ప్రారంభమైనప్పటి నుండి ప్రభుత్వం నెలకు రూ. 300 కోట్లు ఆర్టీసీకి విడుదల చేస్తోందని, ఈ పథకం వల్ల పనిభారం పెరిగినప్పటికీ సిబ్బంది ఎంతో కష్టపడి విజయవంతం చేస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా రాఖీ పౌర్ణమి వంటి పండుగ రోజుల్లోనూ మహిళా ప్రయాణికుల కోసం కార్మికులు తమ సోదరులకు రాఖీ కట్టి మరీ విధులు నిర్వహించడం వారి నిబద్ధతకు అద్దం పడుతోందన్నారు. కార్మికుల సంక్షేమంతో పాటు వారి కుటుంబాల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రూ. 6 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న ఆర్టీసీ ఉద్యోగులు, అవుట్ సోర్సింగ్ సిబ్బందితో సహా ప్రతి ఒక్కరూ ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని మంత్రి స్పష్టం చేశారు. రిటైర్డ్ కార్మికుల సమస్యల పరిష్కారానికి కూడా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో సంస్థ పరిరక్షణ, ప్రయాణికుల సౌలభ్యం, కార్మికుల సంక్షేమం అనే మూడు ప్రధాన అంశాల ఆధారంగా సంస్థను ముందుకు తీసుకెళ్తామన్నారు. కార్మిక సంఘాల ఎన్నికల అనంతరం నలుగురు మంత్రులు, అధికారుల కమిటీ తీసుకున్న నిర్ణయం మేరకు ఆర్టీసీ విలీన ప్రక్రియను కూడా ప్రారంభిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. అలాగే క్యూర్ ఏరియా పరిధిలో అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మిస్తామని, గ్రామాల నుండి రాజధాని వరకు కొత్త రూట్లలో బస్సులు నడుపుతూ, మెట్రో మరియు ఎంఎంటీఎస్ సర్వీసులతో ఆర్టీసీని అనుసంధానం చేసి రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. ఆర్టీసీ పేదవాడి గుండె చప్పుడు అని, కాబట్టి యాజమాన్యం తీసుకుంటున్న సంక్షేమ, అభివృద్ధి చర్యల్లో ఉద్యోగులంతా మరింత బాధ్యతగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై. నాగిరెడ్డి మాట్లాడుతూ తోటి ఉద్యోగి కుటుంబం కష్టాల్లో ఉన్నప్పుడు సంస్థలోని సిబ్బంది అంతా ఏకతాటిపైకి వచ్చి రూ. 90.85 లక్షల భారీ ఆర్థిక సహాయాన్ని అందించడం ఆర్టీసీ ఉద్యోగులలో ఉన్న అంతర్గత బంధానికి, పరస్పర సహకారానికి ఒక గొప్ప నిదర్శనమన్నారు.

# పట్టణ ప్రజలకు నాణ్యమైన ఇంధనాన్ని అందించాలి

## -జిల్లా ఇంచార్జి మంత్రి,కొలుసు పార్థసారథి



**బాపట్ల,జూలై 20 (వార్తాప్రభ) :** నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పట్టణ ప్రజలు ఇంధనాన్ని అందించాలని జిల్లా ఇంచార్జి మంత్రి మరియు రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పేర్కొన్నారు. బాపట్ల మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీపీసీఎల్ పెట్రోల్ బంక్ ను సోమవారం ఉదయం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్,వి.,స్థానిక ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు,బావుడా చైర్మన్ రాజశేఖర్ బాబు తోకలసి పెట్రోల్ బంక్ ను ప్రారంభోత్సవం చేశారు. ముందుగా మంత్రి పెట్రోల్ బంక్‌ను పరిశీలించి, నిర్వహణకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మీడియా తో మాట్లాడుతూ బాపట్ల పట్టణం పరిధిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీపీసీఎల్ పెట్రోల్ బంక్ ద్వారా నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఇంధనాన్ని పట్టణ అందించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజలకు నాణ్యమైన ఇంధన సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు మున్సిపాలిటీ కి ఆదాయ వనరులను పెంపొందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. మున్సిపాలిటీలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు ఆదాయాన్ని పెంచే వివిధ కార్యక్రమాలను ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు. ఈ బీపీసీఎల్ పెట్రోల్ బంక్ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందడంతో పాటు మున్సిపాలిటీకి అదనపు ఆదాయం సమకూరుతుందని మంత్రి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, మౌలిక సదుపాయాల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఏ. హరి కుమార్,మున్సిపల్ కమిషనర్ యం.హాసిని,డి ఈ కృష్ణ రెడ్డి, తహశీల్దార్ షేక్ సలీమ, బీపీసీఎల్ ప్రతినిధులు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### భారత్--యునైటెడ్ కింగ్‌డమ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం అమల్లోకి....

# తిరుపతి శ్రీ వర్ష ఫుడ్స్ నుండి యూకేకు తొలి మామిడి గుజ్జు ఎగుమతి ప్రారంభం



**తిరుపతి(పి.ఐ.బి.),జూలై 20 (వార్తాప్రభ) :** భారత్--యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్.టి.ఏ.) అమల్లోకి వచ్చిన నేపథ్యంలో, తిరుపతికి చెందిన శ్రీ వర్ష ఫుడ్స్ యూకేకు తొలి మామిడి గుజ్జు (మ్యాంగో పల్ప్) ఎగుమతి కంటైనర్‌ను ప్రారంభించింది. ఇది ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ మరియు ఆహార ప్రాసెసింగ్ రంగానికి ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ఏపీఈడిఏ ప్రాంతీయ ఏజీఎం ఆర్. పి. నాయుడు, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్ (డీజీఎఫ్‌టీఏ) ఫణి కిరణ్, ఆంధ్రప్రదేశ్ ఉద్యాన శాఖ జాయింట్ డైరెక్టర్ దేవముని రెడ్డి తిరుపతి జిల్లా ఉద్యాన శాఖ అధికారి జయభారత్ రెడ్డి పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఏపీడీఏ పరిధిలోని వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు ప్రస్తుతం సుమారు ?6,000 కోట్ల విలువతో కొనసాగుతున్నాయని, భారత్--యూకే ఎఫ్‌టీఏ అమలుతో భారతీయ రైతులు, ఆహార ప్రాసెసింగ్ పరిశ్రమలు మరియు ఎగుమతిదారులకు యూకే మార్కెట్‌లో మరిన్ని అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు.యూకేకు తిరుపతి నుంచి తొలి మామిడి గుజ్జు ఎగుమతి ప్రారంభం, భారతదేశంలో విలువ ఆధారిత వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులకు ఒక కొత్త అధ్యాయానికి నాంది పలికిందని వారు అభిప్రాయపడ్డారు. ఉద్యానవన పంటల ఉత్పత్తి మరియు ఆహార ప్రాసెసింగ్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఉన్న బలమైన సామర్థ్యం ఈ ఒప్పందం ద్వారా మరింత ప్రయోజనం పొందుతుందని తెలిపారు. ఈ ఎగుమతి ప్రారంభం ద్వారా తిరుపతి జిల్లా అంతర్జాతీయ ఆహార ఎగుమతుల కేంద్రంగా మరింత గుర్తింపు పొందడంతో పాటు, రైతులు, ప్రాసెసర్లు, ఎగుమతిదారులకు కొత్త అవకాశాలు లభించి భారత వ్యవసాయ ఎగుమతుల అభివృద్ధికి తోడ్పడుతుందని అధికారులు పేర్కొన్నారు.

**CHANGE OF NAME**

I, **YENUGA KAMAKSIHI (Old Name), W/o. Yenuga Shankar**, R/o. # 43-77-02, Block No.77, Near Bhagat Singh Park, Ajithsingh Nagar, Vijayawada, NTR District-520015, A.P. India. I have changed my name as **INALA DIMPLE (New Name), W/o. Yenuga Shankar**. Hereafter my name is known as **INALA DIMPLE (New Name), W/o. Yenuga Shankar.**

# హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఎల్ఐజీ ఇళ్లకు శ్రీకారం

**● సొంత స్థలం లేని నిరుపేదలకు అపార్ట్‌మెంట్ తరహా గృహాలు**
**● 26 నియోజకవర్గాల్లో తొలి దశలో 500 ఫ్లాట్లు -- అర్హతలు, దరఖాస్తు విధానంపై బ్రోచర్ విడుదల.....**




**కూకట్‌పల్లి,జూలై 20 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని నిరుపేద కుటుంబా లకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతిష్ఠాత్మక ఇందిరమ్మ ఇళ్ల పథకం నగర ప్రాంతాలకు విస్తరించింది. ఇప్పటి వరకు ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో అమలైన ఈ పథకాన్ని తాజాగా హైదరాబాద్‌లోని హైడ్రా పరిధిలో ఎల్ఐజీ (తక్కువ ఆదాయ వర్గాల) గృహాల నిర్మాణం ద్వారా నగర పేదలకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ మేరకు సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించారు. అనంతరం పథకానికి సంబంధించిన అర్హతలు, దరఖాస్తు విధానం, ఎంపిక ప్రక్రియ వివరాలతో కూడిన అధికారిక బ్రోచర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, సమాజంలోని ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందన్నారు. మొదటి విడతలో సొంత స్థలం ఉన్న లబ్ధిదారులకు 4.5 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, వాటిలో 2 లక్షలకు పైగా ఇళ్లు ఆగస్టు నాటికి పూర్తికానున్నట్లు తెలిపారు. అనంతరం రెండో విడతలో మరో 2.5 లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు వెల్లడించారు. సొంత స్థలం కూడా లేని పేద కుటుంబాల కోసం ప్రత్యేకంగా అపార్ట్‌మెంట్ తరహాలో గృహాలను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ స్థలాల్లో ఎలాంటి లాభాపేక్ష లేకుండా, పూర్తి పారదర్శకంగా ఈ ఇళ్ల నిర్మాణం చేపట్టి అర్హులైన వారికి కేటాయిస్తామని స్పష్టం చేశారు. మొదటి దశలో రాష్ట్రంలోని 26 నియోజకవర్గాల్లో 500 ఎల్ఐజీ అపార్ట్‌మెంట్ గృహాలు నిర్మించనున్నట్లు తెలిపారు. ప్రతి ఫ్లాట్ 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో, అన్ని మౌలిక సదుపాయాలతో నిర్మించబడుతుందని వెల్లడించారు.

**అర్హతలు ఇవే...** పథకం కింద లబ్ధి పొందాలంటే కుటుంబ వార్షిక ఆదాయం రూ.6 లక్షలకు మించరాదు. అలాగే దరఖాస్తుదారునికి సొంత ఇల్లు లేదా ఇంటి స్థలం ఉండకూడదు. ప్రభుత్వం నిర్దేశించిన ఇతర నిబంధనలను కూడా తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. నగర ప్రాంతాల్లో సొంత ఇల్లు లేని నిరుపేదలకు ఈ పథకం ద్వారా గృహ భద్రత కల్పించడంతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపర్చడమే ప్రభుత్వ క్ష్యమని మంత్రులు పేర్కొన్నారు. నగర పేదల గృహ అవసరాల పరిష్కారంలో ఈ ప్రాజెక్టు కీలక మైలురాయిగా నిలుస్తుందని వారు అభిప్రాయపడ్డారు.

## శ్రీ తిరుపతమ్మ ఆలయం వరకు ఆర్ టీ సి బస్సులు నడపాలని ప్రజావాణి లో ఫిర్యాదు..



**పెనుగంచిప్రోలు, జూలై 20 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలోని శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి ఆలయం వద్దకు ఆర్టీసీ బస్సులు నడపాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎండిఓ జి శ్రీను అధ్యక్షతన సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో సహకార సంఘ అధ్యక్షులు కర్ల వెంకటనారాయణ, తెలుగుదేశం పార్టీ విజయవాడ పార్లమెంటరీ అధికార ప్రతినిధి నలమోలు శివరాం ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు తాడపునేని సత్యంబాబు, మండల కాపు సంఘం నాయకులు యనమదల శ్రీనివాసరావు ఫిర్యాదు చేశారు..గత మూడు వారాలుగా ఆర్టీసీ బస్సులను అమ్మవారి ఆలయం వద్దకు వెళ్లకుండా ఊరు బయట చెరువు కట్ట సెంటర్ వద్ద నిలిపివేయడంతో పిల్లా పాపలు, వృద్ధులతో కలిసి వచ్చే భక్తులు తమ లగేజీని మోసుకుంటూ సుమారు కిలోమీటర్ మేర నడుచుకుంటూ ఆలయం వద్దకు చేరుకోవటానికి తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని దీన్ని దృష్టిలో ఉంచుకొని గతంలో మాదిరిగా ఆర్టీసీ బస్సులను అమ్మవారి ఆలయం వద్దకు నడిచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు ప్రజావాణి లో ఫిర్యాదు చేశారు.

## భక్తుల సౌకర్యాలకు అధిక ప్రాధాన్యత

– ఈ ఈ. జీవిడిఎన్ లీలా కుమార్....



**పెనుగంచిప్రోలు, జూలై 20 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు లో ప్రముఖ పుణ్య క్షే త్రంగా వెలుగొందు తున్న శ్రీ తిరుపతమ్మ అమ్మ వారి ఆలయం వద్ద భక్తుల సౌకర్యాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆలయ ఈఈ జీ వి డి ఎన్ లీలా కుమార్ అన్నారు, ఆదివారం ఆయన ఆలయం తో పాటు ప్రాంగాణం లో ఉన్న డార్మెటరీ, లాకర్ సదుపాయం తో పాటు కేశ ఖండనశాలను తనిఖీ చేశారు.సిబ్బంది కీ పలు సూచనలు సలహాలు ఇచ్చారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తుల రద్దీ దృష్ట కల్పించాల్సిన సౌకర్యాల పై ప్రత్యేక దృష్టి పెడతామన్నారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ మాజీ చైర్మన్ చుంచు రమేష్ బాబు, ఆలయ సూపర్టెంట్ రాజు, ఇన్స్పెక్టర్ బత్తుల కృష్ణ, నవీన్, విశ్రాంత ఉద్యోగి నలూరి వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు,

## తిరువూరు ఆర్డీవో కార్యాలయంలో పీజీఆర్ఎస్

-- ప్రజల అర్జీలు స్వీకరించిన ఆర్డీవో ఏ. కుమార్




**తిరువూరు,జూలై 20 (వార్తాప్రభ) :** తిరువూరు రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీ ఏ. కుమార్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (PGRS) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజల నుండి భూ సంబంధిత, రెవెన్యూ మరియు ఇతర పరిపాలనా అంశాలపై అర్జీలను ఆర్డీవో స్వీకరించారు. అర్జీదారులు వివరించిన సమస్యలను ఓర్పుగా విన్న ఆర్డీవో, ప్రతి అర్జీని సంబంధిత అధికారులకు పంపిస్తూ నిబంధనల మేరకు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత మేరకు త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన సేవలు అందించేందుకు అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖ అధికారులు, కార్యాలయ సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కూరగాయల అమ్మకుందారులకు స్థలాన్ని కేటాయించండి





**విస్సన్నపేట,జూలై 20 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో తాత్కాలిక రైతు బజార్ కు స్థలాన్ని కేటాయించాలని దాని వలన ప్రమాదాలు నివారించవచ్చని సర్వత్ర కోరుతున్నారు. రైతు బజార్ ఏర్పాటు చేయడం వలన ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అవుతుందని పలువురు భావిస్తున్నారు. ఆకుకూ రలు కాయకూరలు ఫ్రూట్స్ పువ్వులు చికెన్ మటన్ ఫిష్ వాటి షాపులన్నీ కూడా ఒకే ప్రాంతంలో ఉండటం వల్ల ట్రాఫిక్ నియంత్రణ చేయవచ్చని పలువురు పెద్దలు భావిస్తున్నారు.

## బర్మింగ్‌హామ్‌లో మంగళగిరికి చెందిన భారతీయ యువ రచయిత్రులకు అంతర్జాతీయ గుర్తింపు





**బర్మింగ్‌హామ్ (యునైటెడ్ కింగ్‌డమ్),జూలై 20 (వార్తాప్రభ) :** యునైటెడ్ కింగ్‌డమ్‌లోని బర్మింగ్‌హామ్ భారత కాన్సులేట్ జనరల్ కార్యాలయంలో 2026 జూలై 18న నిర్వహించిన గీతాంజలి సర్కిల్ ఫర్ యంగ్ క్రియేటివ్ రైటర్స్ ( జి సి వై సి డబ్ల్యూ ) ఆధ్వర్యంలోని "కృష్ణన్ తల్వార్ అవార్డ్ ఫర్ యంగ్ క్రియేటివ్ రైటర్స్" కార్యక్రమంలో భారతీయ యువ రచయిత్రులు ప్రణవి బిట్రా (16 సంవత్సరాలు) మరియు ఇషాన్వి బిట్రా విశిష్ట గౌరవాలు అందుకున్నారు. ఇరువురు సోదరీమణులు మంగళగిరికి చెందిన బిట్రా వెంకటేశ్వరరావు, మల్లికల కుమార్తెలు. ప్రణవి బిట్రాకు (16 సంవత్సరాలు) సృజనాత్మక రచనలో ప్రతిభ, ఊహాశక్తి మరియు సాహిత్య నిబద్ధతకు గుర్తింపుగా "కృష్ణన్ తల్వార్ అవార్డ్ ఫర్ యంగ్ క్రియేటివ్ రైటర్స్ -- 2026" ప్రదానం చేశారు. అదే కార్యక్రమంలో ఇషాన్వి బిట్రాకు (12 సంవత్సరాలు) సృజనాత్మక రచనా కార్యక్రమంలో చురుకైన భాగస్వామ్యానికి పాల్గొనిన ధ్రువపత్రం (సర్టిఫికెట్ ఆఫ్ పార్టిసిపేషన్) అందజేశారు. డా. కృష్ణ కుమార్ మరియు చిత్ర కుమార్ స్థాపించిన గీతాంజలి సర్కిల్ ఫర్ యంగ్ క్రియేటివ్ రైటర్స్ (+జిజెజె) ఈ యువ రచయిత్రుల సాహిత్య ప్రతిభను అభినందిస్తూ, భవిష్యత్తులో మరింత సృజనాత్మక రచనలు చేసి ప్రపంచ సాహిత్యానికి విశిష్ట సేవలు అందించాలని ఆకాంక్షించింది. ప్రణవి బిట్రా మరియు ఇషాన్వి బిట్రా సాధించిన ఈ అంతర్జాతీయ గుర్తింపు భారతీయ యువ రచయితల ప్రతిభకు ప్రపంచస్థాయిలో లభిస్తున్న గౌరవానికి నిదర్శనంగా నిలుస్తూ, సాహిత్య రంగంలో ముందుకు రావాలనుకునే యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుంది.

## మండల పరిధిలోని పాఠశాల స్కూల్ బస్సులను ప్రత్యేక తనిఖీ




**నూజివీడు,జూలై 20 (వార్తాప్రభ) :** నూజివీడు నియోజకవర్గం, చాట్రాయి మండల పరిధిలోని పాఠశాల స్కూల్ బస్సులను మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మరియు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ప్రత్యేక తనిఖీలను నిర్వహించడం జరిగినది. రవాణా శాఖ నిబంధనల ప్రకారం 60 సంవత్సరాలు వయోపరిమితి దాటిన వ్యక్తి డ్రైవింగ్ చేయుటకు వీలు లేదు. స్కూల్ బస్సులు డ్రైవింగ్ చేసే వ్యక్తికి కనీసం 5 సంవత్సరాలు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ మరియు అనుభవం కలిగి ఉండవలెను. అత్యవసర ద్వారం వద్ద ఎటువంటి అదనపు సీట్లు మరియు వేరే ఫిట్టింగ్లు చేయరాదు. ప్రతి స్కూల్ బస్సు ఏ రూట్ వెళుతుందో ఆ రూటు అన్నది డిస్ప్లేలో చూపించవలెను. ఇప్పటివరకు కాలేజీ మరియు స్కూల్ యాజమాన్యం వారితో జిపిఎస్ డాష్ బోర్డు కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పలుమార్లు సూచించడం జరిగినది. ఇప్పటికే GPS డాష్ బోర్డు కెమెరాలు ఏర్పాటు చేయని యాజమాన్యాలు వెంటనే చర్యలు తీసుకొని వాటిని ఏర్పాటు చేసుకోవలసినదిగా జిల్లా అధికా రులు సూచించడం జరిగినది. ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం వలన ప్రమాదాలు జరగకుండా వాటిని పూర్తిగా నివారించేందుకు మరియు విద్యార్థుల యొక్క భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారి భద్రత విషయంలో ప్రత్యేక జాగ్రత్త తీసుకొనవచ్చును. విద్యార్థుల ప్రయాణ భద్రత నిరంతరం పర్యవేక్షించవచ్చు. రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరగకుండా ఎప్పటికప్పుడు యాజమాన్యం వారు కూడా తగు జాగ్రత్తలు తీసుకునే అవకాశం కలదు.అలాగే బస్సులో ప్రయాణించే స్కూలు విద్యార్థులు పూర్తి వివరాలు మెయింటెన్ చేయవలెను. ప్రతి బస్సులో ఒక అటెండర్ ని నియమించవలెను. ఫస్ట్ ఎయిడ్ బాక్ కమిటీని ఏర్పాటు చేయవలెను. స్కూల్ బస్సులు ఫిట్నెస్ స్కూల్ బస్సులు నిర్వహణలో ఏమాత్రం అశ్రద్ధ చూపించిన కఠిన చర్యలు తీసుకుంటామని, స్కూల్ బస్సు నడిపే డ్రైవర్లు పూర్తిగా ఆరోగ్యం కలిగి ఉండి హెవీ లైసెన్స్ కలిగి ఉండాలని, అలాగే పరిమితి నుంచి విద్యార్థులు ఎక్కించుకోకూడదని .స్కూల్ బస్సులకు సంబంధించి ఎప్పటికప్పుడు ప్రభుత్వం వారికి టాక్సులు చెల్లించడంతోపాటు వాహనముకు సంబంధించిన సరైన పత్రాలు ఉంచుకోవాలని, అలాగే కాలం చెల్లిన బస్సులను నడపరాదని రోడ్డుపై తిరిగే ప్రతి స్కూల్ బస్సు సామర్థ్య పరీక్షలు చేయించుకోవాలని స్కూల్ యాజమాన్యం వారికి తెలియజేయడం జరిగింది. రోడ్డు భద్రత నియమ నిబంధనలు పాటించుట, ట్రాఫిక్ రూల్స్ కు అనుగుణంగా బస్సులు నడపటం, స్కూల్ పిల్లల్ని బస్సు ఎక్కించేటప్పుడు, వారిని దింపేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని, ఎక్కడపడితే స్కూల్ బస్సులో నిలుపు రాదని నిర్నిత పార్కింగ్ ప్రదేశంలోనే బస్సులో నిలపవలెనని ప్రతి డ్రైవర్ మరియు యాజమాన్యం వారు పర్యవేక్షించడం వలన రోడ్డు ప్రమాదాలను మనం పూర్తిగా అరికట్టవచ్చును. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ మరియు అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ తెలియజేసినారు

## చింతలపూడి ఎత్తిపోతల పథకం పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు







**విస్సన్నపేట,జూలై 20 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో చింతలపూడి ఎత్తిపోతల పథకం నకు సంబంధించి పర్యావరణ సంబంధిత ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశా పాల్గొన్నారు. వెస్ట్ గోదావరి ఎన్టీఆర్ జిల్లా కృష్ణాజిల్లా లను కలుపుకొని ఏర్పాటయ్యే సంబంధిత ప్రాజెక్టు గురించి ప్రజల అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు, ఆర్డీవో కుమార్ ఎడి శశికళ,మండల తాసిల్దార్ కే లక్ష్మీ కళ్యాణి, ఎంపీడీవో చిన్న రాట్నాలు, డిప్యూటీ ఎంపీడీవోలు శివకుమార్ రామ్మోహన్ లు, ఏవో రాజలక్ష్మి,టిడిపి సీనియర్ నాయకులు గోటేటి సుబ్రహ్మణ్యేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు, నెక్కలపు శ్రీనివాసరావు ఆకుల రాధ, కృష్ణ ప్రసాద్ పులపాక శ్రీనివాసరావు రైతు సంఘం నాయకుడు సాంబశివరావు, కోలేటి రంగారావు, మురుగుల ప్రసాద్ సుధాకర్ స్టాలిన్ టి కృష్ణ వేమన పలు శాఖల అధికారులు గ్రామస్తులు పాల్గొన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ మామిడి మొక్కను నాటారు.

## బాల్య వివాహాలు వద్దు.. బాలికల భవిష్యత్తును కాపాడుకుందాం

● బాల్య వివాహాల వల్ల ఆరోగ్య, సామాజిక అనర్థాలపై అవగాహన



**హనుమాన్ జంక్షన్,జూలై 20 (వార్తాప్రభ) :** మద్దాయికుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్థానిక వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో బాలికలకు "బాల్య వివాహాలు -- ప్రమాదాలు" అనే అంశంపై ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు దారపురెడ్డి భాస్కరరావు మాట్లాడుతూ, మారుతున్న జీవనశైలి, జంక్ ఫుడ్ వినియోగం, పేదరికం తదితర కారణాలతో బాలికల్లో శారీరక ఎదుగుదల ముందుగానే కనిపిస్తున్నప్పటికీ, వివాహానికి తగిన మానసిక పరిపక్వత అవసరమని తెలిపారు. 21 సంవత్సరాలు పూర్తయ్యే వరకు ఏ బాలిక కూడా వివాహం చేసుకోరాదని, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. సీహెచ్ఓ ఆశాజ్యోతి మాట్లాడుతూ, కౌమార దశలో శారీరక ఎదుగుదలతో పాటు మానసిక ఎదుగుదల కూడా ఎంతో ముఖ్యమని చెప్పారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండి, ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో స్థిరపడిన తర్వాతే వివాహం చేసుకోవాలని బాలికలకు సూచించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే అధికారులకు సమాచారం అందించి వాటిని అడ్డుకోవడంలో ముందుండాలని పిలుపునిచ్చారు. బాల్య వివాహాల వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, సామాజిక వెనుకబాటుతనం గురించి ప్రతి బాలిక అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఏఎన్ఎం శిరోమణి, ఆశా వర్కర్ రత్నాల చంటి తదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ టీటీడీ కళ్యాణ మండపంలో ఆకస్మిక తనిఖీలు

- ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ క్షేత్ర పరిశీలన



**కాకినాడ,జూలై 20 (వార్తాప్రభ) :** కాకినాడ బాలాజీ చెరువు వద్ద ఉన్న తిరుమల తిరుపతి దేవస్థానం కళ్యాణ మండపాన్ని సోమవారం టీటీడీ బోర్డు సభ్యులు, జగ్గంపేట శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు.మండపంలోని డైనింగ్ హాలు, వంటగది, ఆడిటోరియం, పార్కింగ్ స్థలం తో పాటు మెత్తం ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు.తనిఖీలో భాగంగా ఎన్ని గదులు ఉన్నాయి రెంటల్ వసూళ్లు ఏ విధంగా జరుగుతున్నాయి.వినియోగ దారులకు అందించే సదుపాయాలు సరిగ్గా ఉన్నాయా అనే అంశాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. వినియోగదారులకు మరింత సౌకర్యంగా ఉండేందుకు ఓపెన్ కిచెన్ ఏర్పాటుకు మండపం బయట ఉన్న స్థలాన్ని కూడా పరిశీలించారు. దీనిపై త్వరలో తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. వినియోగదారుల సౌకర్యాల విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, లోపాలుంటే వెంటనే సరిచేయాలని అధికారులను ఆదేశించారు.

## నిజాం పేటలో విశ్వహిందూ పరిషత్ ప్రత్యేక పూజలు



**మచిలీపట్నం,జూలై 20 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిజాంపేట శ్రీ కల్యాణ సుందరేశ్వర సమితి కమిటీ ఆధ్వర్యంలో రుద్రాక్ష అర్చన సిందూర కుంకుమార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మొత్తం 75 మంది మహిళలు పాల్గొని భక్తిపూర్వకంగా పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూనపురెడ్డి శ్రీనివాసరావు గురువిందపల్లి విజయబాబు జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం వర్రె రాజశేఖర్ గొట్టిముక్కల సాయి లత విన్నకోట ప్రభాకరరావు నరసింహారావు సుబ్రహ్మణ్యం నందకిషోర్ శ్రీనివాసు రంగబాబు శ్రీధర్ పార్థసారథి పాండురంగరావు పులివర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే శీలం బాబ్జి గంటా సురేష్ తదితరులు ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలకు విశ్వ హిందూ పరిషత్ కృష్ణా జిల్లా అధ్యక్షులు డా. బూరగడ్డ శ్రీనాథ్ జిల్లా ప్రభారి పి.వి.ఎస్. నాయుడు ధన్యవాదాలు తెలిపారు.

## తిరుపతమ్మ అమ్మ వారి సత్రం లో గుండెపోటుతో మహిళ మృతి...



**పెనుగంచిప్రోలు, జూలై 20 (వార్తాప్రభ) :** పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ గోపయ్య సమేత శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తురాలు గుండెపోటుతో ఆదివారం తెల్లవారు జామున మృతిచెందింది. ఆమె వివరాలు,ప్రకాశం జిల్లా, మద్దిపాడు మండలం,గోరేపల్లి గ్రామానికి చెందిన రావిపాటి పద్మావతి మరియు వారి కుటుంబ సభ్యులు, గత రాత్రి శ్రీ తిరుపతమ్మ అమ్మవారి సత్రాలలోనికి చేరుకొని రాత్రి నిద్ర చేసి ఉదయం లేచి కుటుంబ సభ్యులు చూసేసరికి మృతి చెందారని కుటుంబ సభ్యులు తెలియపరిచారు, దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు పెనుగంచిప్రోలు పోలీసులు తెలిపారు..

## రిజిస్ట్రేషన్ల ప్రైవేటీకరణకు నిరసనగా పెన్డౌన్ కార్యక్రమం



**విస్సన్నపేట,జూలై 20 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో రిజిస్ట్రేషన్ల ప్రైవేటీకరణకు నిరసనగా దస్తావేజు లేఖరుల సంఘం పెన్ డౌన్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సంఘ సభ్యులు తెలియజేశారు. 30వ తేదీ వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని స్థిరాస్తి కొనుగోలు అమ్మకం దారులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. 396 జీవోను రద్దు చేసే వరకు పాము అలుపెరగని పోరాటం చేస్తామన్నారు.

## ఆశించిన వర్షపాతం లేక రైతుల ఆందోళన.. అప్పులు తెచ్చి బోర్ల నీటితో అరకొర సాగు



**తిరువూరు,జూలై 20 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు మండలంలో ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కాకపోవడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అప్పులు తెచ్చి వ్యవసాయ పనులు ప్రారంభించిన రైతులు, పొలాల్లో ఉన్న బోర్ల ద్వారా లభిస్తున్న నీటిపైనే ఆధారపడి అరకొరగా సాగు పనులు కొనసాగిస్తున్నారు. అయితే ఎండలు ఇదే విధంగా కొనసాగితే భూగర్భ జలాలు కూడా అడుగంటిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో అప్పులు చేసి సాగు చేసిన వరి పంట చివరి వరకు నిలిచి చేతికి వస్తుందో లేదో అనే భయం వారిని వెంటాడుతోంది. వెంటనే మంచి వర్షాలు కురవాలని, ప్రభుత్వం పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 396 ని రద్దు చేయాలి...

బంటుమిల్లి సబ్ రిజిస్టర్ ఆఫీస్ పరిధిలోని డాక్యుమెంట్ రైటర్లు



**కృత్తివెన్ను,జూలై 20 (వార్తాప్రభ) :** ప్రభుత్వం విడుదలచేసిన జీవో నెంబర్ 396 ను రద్దు చేయాలని ఈనెల 20వ తేదీ నుండి 31వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా పెన్ డౌన్ కార్యక్రమ నిర్వహించాలని జీవో నెంబర్ 396 ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర దస్తా వేజు లేకర్ల సంఘం ఇచ్చిన పిలుపుమేరకు బంటుమిల్లి సబ్ రిజిస్టర్ పరిధిలోని దస్తావేజులేకర్లు సోమవారం పెన్డౌన్ కార్యక్రమాన్ని లేఖరులు చేపట్టారు. పెన్డౌన్ కార్యక్రమం లో భాగంగా బంటుమిల్లి ఎస్ఆర్ఓ పరిధిలో లేకరులు డిమాండ్ తో కూడిన వినతిపత్రాన్ని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అలాగే బంటుమిల్లి ఎస్ ఆర్ ఓ శేఖర్ రావు లకు వినతి పత్రాలు సమర్పించారు....

## హమాలీల శ్రమకు న్యాయం ఎప్పుడు!!

- 8 ఏళ్లుగా కూలీ పెంపు లేదు
- హోల్‌సేల్ వ్యాపారులపై ఏఐటీయూసీ ఫైర్
- 60 హమాలీ కుటుంబాలు ఆర్థిక కష్టాల్లో
- కలెక్టర్ జోక్యం కోరిన హమాలీలు




**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 20 (వార్తాప్రభ):** గోదావరిఖని కూరగాయల మార్కెట్‌లో హమాలీ కూలీల శ్రమను దోపిడీ చేస్తూ ఎనిమిదేళ్లుగా కూలీ రేట్లు పెంచకుండా హోల్‌సేల్ వ్యాపారులు అన్యాయం చేస్తున్నారని ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు మడ్డి ఎల్లా గౌడ్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సోమవారం భాస్కర్‌రావు భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 2019 నుంచి ఒక్క రూపాయి కూడా కూలీ పెంచకుండా 60 హమాలీ కుటుంబాలను ఆర్థిక సంక్షోభంలోకి నెట్టేశారని ఆరోపించారు. ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి కూలీ రేట్లు సవరించాలనే ఒప్పందాన్ని ఉద్దేశపూర్వకంగా అమలు చేయకుండా హోల్‌సేల్ వ్యాపారుల సంఘం అధ్యక్షుడు దుండె మల్లేశం అడ్డుపడుతున్నారని విమర్శించారు. నిత్యం బస్తాలు మోసి చెమటోడ్చే కూలీలకు న్యాయం చేయాల్సింది పోయి కాలయాపన చేస్తూ వారి కడుపు కొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కారణంగా 40 ఏళ్లుగా మార్కెట్‌లో పనిచేస్తున్న 60 కుటుంబాలు ప్రతి నెల సుమారు రూ.9 లక్షల మేర ఆదాయాన్ని కోల్పోతున్నాయని తెలిపారు. ట్రేడర్ లైసెన్సులు లేకుండానే వ్యాపారం చేస్తూ, ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా రైతుల నుంచి 10 శాతం కమిషన్ వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు కూడా చేశారు. కూలీ రేట్ల పెంపు కోసం డిప్యూటీ లేబర్ కమిషనర్‌కు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడం బాధాకరమన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని వ్యాపారులతో చర్చలు జరిపి కొత్త కూలీ రేట్లు అమలు చేయాలని, లేకుంటే భారీ ఉద్యమాలకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. సమావేశంలో ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, నాయకులు ఎం.ఎ.గౌస్, అటికేటి రాజు, బూడిద మల్లేష్, గన్నెర్ల చంద్రయ్య, హమాలీ వర్కర్స్ యూనియన్ నాయకులు కండె లక్ష్మయ్య, రాంచందర్, జానీ మియా, గాలిపెల్లి సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ శాఖల మధ్య సమన్వయం, వేగవంతమైన సమాచార మార్పిడి అత్యంత కీలకం

**-పోలీస్ కమిషనర్ డాక్టర్ రమేష్**





**శేరిలింగంపల్లి,జూలై 20 (వార్తాప్రభ):** సరిహద్దు ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు పోలీసు శాఖల మధ్య సమన్వయం, వేగవంతమైన సమాచార మార్పిడి అత్యంత కీలకమని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. ఎం.రమేష్ అన్నారు. సైబరాబాద్ పోలీస్ ఆధ్వర్యంలో గోల్కొండ రిసార్ట్‌లో నిర్వహించిన బోర్డర్ క్రైమ్ కోఆర్డినేషన్ సమావేశంలో ఆయన మాట్లాడారు.ఒక ప్రాంతంలో నేరానికి పాల్పడి మరో ప్రాంతానికి పారిపోయే నేరస్థులను త్వరగా గుర్తించి పట్టుకోవాలంటే పరస్పర సహకారం అవసరమని తెలిపారు.సమావేశంలో రౌడీ షీటర్లు, అంతర్‌రాష్ట్ర ముఠాలు,సైబర్ నేరాలు, సంయుక్త పెట్రోలింగ్,సీసీటీవీ వినియోగం,మిస్సింగ్ వ్యక్తుల సమాచారం,ట్రాఫిక్ నిర్వహణ, విపత్తుల సమయంలో సంయుక్త చర్యలు తదితర అంశాలపై అధికారులు సమీక్షించి కార్యాచరణపై చర్చించారు.వివిధ కమిషనరేట్లు,జిల్లాల పోలీసు ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.

## నిరుపేద కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్‌ఓసీ పత్రం అందజేత

**ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ చొరవతో భూమిరెడ్డినగర్ వాసికి ఆర్థిక సహాయం**

**బాధితుడికి అండగా నిలిచిన కాలనీ సంక్షేమ సంఘం, బీఆర్ఎస్ నాయకులు**



**కుత్బుల్లాపూర్, జూలై 20, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ ఆదేశాల మేరకు ఆదివారం నాడు నిరుపేద కుటుంబానికి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి గ్యారంటీ పత్రాన్ని (ఎల్‌ఓసీ) అందజేశారు. కుత్బుల్లాపూర్ పరిధిలోని భూమిరెడ్డినగర్ కాలనీకి చెందిన ఇందుకూరి ప్రభావతి గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమె వైద్య ఖర్చులకు భారీగా డబ్బు అవసరం కావడం, అంతటి ఆర్థిక స్థోమత కుటుంబానికి లేకపోవడంతో భర్త సత్యనారాయణ రాజు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ విషయాన్ని భూమిరెడ్డినగర్ కాలనీ సంక్షేమ సంఘం (వెల్ఫేర్ అసోసియేషన్) అధ్యక్షుడు భూపాల్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ దృష్టికి తీసుకెళ్లారు. బాధితుడి ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఎమ్మెల్యే తక్షణమే స్పందించి, అత్యవసర వైద్య చికిత్స నిమిత్తం ప్రభుత్వం నుండి ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్‌ఓసీ మంజూరు చేయించారు. ఆ మంజూరి పత్రాన్ని కాలనీ ప్రతినిధులు, నాయకులు కలిసి బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపత్కాలంలో తమకు ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచిన ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌కు బాధితుడు సత్యనారాయణ రాజు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ ఎల్‌ఓసీ పత్రం అందజేసే కార్యక్రమంలో భూమిరెడ్డినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు భూపాల్ రెడ్డి, ప్రముఖ నాయకులు పెద్ది మల్లేష్, గోపాలకృష్ణ, కుంట వేణు, కుంట సిద్ధిరాములు, పోగు సమ్మయ్య నేత, మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, కాలే గణేష్, నదీమ్ రాయ్, బాలమల్లేష్, బలరాం, జయం చారి, రాముడు యాదవ్‌తో పాటు కాలనీవాసులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ఊపిరి- సుల్తానాబాద్ ప్రగతి!!

- కష్టాల్లో తోడుగా - ప్రజల కోసం బస్తీ దవాఖాన
- వైద్యం, మహిళా గౌరవం - మన కర్తవ్యం
- రైతన్నకు భరోసా- సేంద్రియ దిశగా అడుగులు
- విప్ చింతకుంట విజయ రమణరావు





**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 20 (వార్తాప్రభ):** ప్రజలందరికీ మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలను వారి గడప వద్దకే అందించాలనే ఉన్నత ఆశయంతోనే రాష్ట్ర ప్రభుత్వం బస్తీ దవాఖానల ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని పెద్దపల్లి శాసనసభ్యులు చింతకుంట విజయరమణారావు తెలిపారు. సోమవారం సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలోని ఏడవ వార్డులో రూ. 20 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న నూతన బస్తీ దవాఖాన భవన నిర్మాణానికి ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక వార్డు కౌన్సిలర్, ఇతర ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే విజయరమణారావును శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పల్లె దవాఖానలు, బస్తీ దవాఖానలను బలోపేతం చేస్తూ ప్రభుత్వ వైద్యశాలల్లో అత్యుత్తమ చికిత్సలు అందిస్తున్నామని, అందులో భాగంగానే ఏడవ వార్డులో ఈ దవాఖాన నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ఈ దవాఖానకు అత్యంత ఆవశ్యకమైన బోర్వెల్, ప్రహరీ గోడ నిర్మాణంతో పాటు ఇతర మౌలిక వసతుల కల్పన కోసం మరో ఐదు లక్షల రూపాయల అదనపు నిధుల మంజూరుకు ప్రత్యేక కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. సమాజంలో మహిళల పాత్ర అత్యంత కీలకమైందని పేర్కొంటూ, మున్సిపల్ పరిధిలోని సుగ్లంపల్లి, పూసాల, సుల్తానాబాద్ లలో మహిళా భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానని, అలాగే సుల్తానాబాద్ పట్టణ పరిధిలోని మహిళలందరి కోసం ప్రత్యేకంగా 10 గుంటల విలువైన స్థలాన్ని కేటాయించి భవన నిర్మాణ నిధులు అందిస్తానని ఎమ్మెల్యే ప్రకటించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాలపై ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వ ఉదాసీనత వల్లే దేశంలో యూరియా కొరత ఏర్పడిందని, గతంలో ప్రధానమంత్రులుగా పనిచేసిన నెహ్రూ, ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీల హయాంలో రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సకాలంలో ఎరువులు అందాయని గుర్తుచేశారు. ప్రస్తుతం వాతావరణంలో 'ఎల్-నినో' ప్రభావం తీవ్రంగా ఉన్నందున, రాబోయే రెండు నెలల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయే ప్రమాదం ఉందని రైతులను అప్రమత్తం చేశారు. కాబట్టి రైతన్నలు ఆందోళన చెందకుండా సాంప్రదాయ వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపాలని సూచించారు. రసాయన యూరియాకు ప్రత్యామ్నాయంగా సేంద్రియ ఎరువులను పెద్ద ఎత్తున వాడుతూ భూసారాన్ని రక్షించుకోవడంతో పాటు, నాణ్యమైన దిగుబడులను పెంచుకునే విధంగా రైతులంతా ఉమ్మడిగా కృషి చేయాలని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు మరియు వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కేటీఆర్‌కు రాజ్ ఠాకూర్ స్ట్రెయిట్ ఛాలెంజ్!!

- మాట నిలబెట్టుకోండి కేటీఆర్
- ఉద్యోగాల లెక్కతో కేటీఆర్‌కు సవాల్
- రామగుండంలో హీట్ పెంచిన ప్రెస్ మీట్
- కేటీఆర్ కోర్టులోకి వెళ్లిన బంతి



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 20 (వార్తాప్రభ):** రామగుండం రాజకీయాల్లో సోమవారం ఒక్కసారిగా వేడి పెరిగింది. ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ మాజీ మంత్రి కేటీఆర్‌కు నేరుగా సవాల్ విసురుతూ "మాట నిలబెట్టుకోండి కేటీఆర్" అని ఘాటుగా వ్యాఖ్యానించారు. రామగుండంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని గతంలో కేటీఆర్ చేసిన వ్యాఖ్యలను గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే 70,664 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేసిందని అధికారిక లెక్కలతో వివరించారు. ఈ నేపథ్యంలో తన మాటకు కట్టుబడి రాజకీయ సన్యాసం తీసుకుంటారా? లేక తెలంగాణ యువతకు బహిరంగ క్షమాపణ చెబుతారా? అని కేటీఆర్‌ను ప్రశ్నించారు. నిరుద్యోగుల పేరుతో బీఆర్ఎస్ చేస్తున్న రాజకీయాలు ఇక ప్రజలు నమ్మరని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ బీజేపీతో లోపాయికారీగా కుమ్మక్కై కాంగ్రెస్ ప్రభుత్వంపై అసత్య ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఫాంహౌస్‌లో కూర్చుని తప్పుడు ప్రచారాలు చేస్తే ప్రజలు విశ్వసించే పరిస్థితి లేదని విమర్శించారు. సోషల్ మీడియాలో అబద్ధపు ప్రచారాలతో యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలు నిజానిజాలను గుర్తించే స్థాయిలో ఉన్నారని, అబద్ధపు రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం ప్రజల సంక్షేమం, నిరుద్యోగుల భవిష్యత్తు కోసం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. రిజర్వేషన్లకు అనుగుణంగా త్వరలోనే జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని వెల్లడించారు. ఇది కేవలం ప్రారంభమేనని, రాబోయే రోజుల్లో లక్షలాది ఉద్యోగాల భర్తీ దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కేటీఆర్‌కు నిజంగా దమ్ముంటే రామగుండం వచ్చి నిరుద్యోగ యువతను ప్రత్యక్షంగా కలవాలని సవాల్ విసిరారు. ఏసీ గదుల్లో కూర్చుని విమర్శలు చేయడం కాదని, ప్రజల మధ్యకు వచ్చి వాస్తవాలు తెలుసుకోవాలని సూచించారు. ఈ ప్రెస్ మీట్‌తో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ అంశం హాట్ టాపిక్‌గా మారింది. కార్యక్రమంలో మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు, సర్పంచులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఇప్పుడు ఈ సవాల్‌కు కేటీఆర్ ఎలాంటి సమాధానం ఇస్తారనే అంశంపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది.

## కరెంట్ కోతలపై కందుల సంధ్యారాణి ఉగ్రరూపం!!

- ఆకెనపల్లి సబ్ స్టేషన్ వద్ద బీజేపీ ధర్నా
- 24 గంటల ఉచిత విద్యుత్ ఏమైంది?
- పాలకులారా.. రైతుల ఉసురు తగలక తప్పదు
- అన్నదాతల గోస.. పాలకుల మొద్దునిద్ర







**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 20 (వార్తాప్రభ):** అంతర్గాం మండలం ఆకెనపల్లి విద్యుత్ సబ్ స్టేషన్ సాక్షిగా సోమవారం నాడు అన్నదాతల ఆక్రందనలు మిన్నంటాయి, పాలకుల నిర్లక్ష్య వైఖరిపై రైతాంగం కదం తొక్కింది. "24 గంటల ఉచిత విద్యుత్" అంటూ రంగుల రాతలు, జబ్బలు చరుచుకునే ప్రకటనలతో అధికార పీఠాన్ని అధిరోహించిన రాష్ట్ర ప్రభుత్వం, నేడు ఆచరణలో మాత్రం వ్యవసాయ రంగాన్ని నిలువునా ముంచేస్తూ అంధకారంలోకి నెట్టేస్తోందని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి నిప్పులు చెరిగారు. ఎండ తీవ్రతకు పంటలు నిలువునా ఎండిపోతుంటే, కన్నీరు మున్నీరవుతున్న రైతుల గోస ఈ ఏసీ గదుల పాలకులకు వినబడటం లేదా అని, అడ్డగోలు కరెంట్ కోతలతో అన్నదాతల వెన్ను విరుస్తున్న ఈ దుర్మార్గాన్ని ఏ రకంగా సమర్థించుకుంటారని ఆమె నిలదీశారు. అర్ధరాత్రి వేళల్లో పొలాలకు నీళ్లు పెట్టడానికి వెళ్లి పాము కాట్లకు, విద్యుత్ షాక్‌లకు గురై రైతులు ప్రాణాలు కోల్పోతుంటే, ఈ ప్రభుత్వానికి కనీసం చలనం లేకపోవడం సిగ్గుచేటని, ఓట్లు వేసి గెలిపించినందుకు అన్నదాతల నోట్లో మట్టి కొడతారా అని ధ్వజమెత్తారు. ఇది కేవలం సాంకేతిక లోపం కాదని, రైతాంగాన్ని పూర్తిగా కోలుకోకుండా చేయాలనే ప్రభుత్వ కుట్ర అని ఆరోపిస్తూ, పంటలు చేతికి వచ్చే ఈ కీలక సమయంలో కరెంట్ కోతలను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతుల జోలికి వస్తే ఎంతటి ప్రభుత్వాలైనా కూలిపోక తప్పదని హెచ్చరిస్తూ, వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించకపోతే రాబోయే రోజుల్లో సబ్ స్టేషన్ల ముట్టడికి దిగుతామని, అన్నదాతలకు న్యాయం జరిగే వరకు బీజేపీ పోరాటం ఆపబోదని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పాలకుర్తి మండల అధ్యక్షుడు మెరుగు నరేష్ గౌడ్, లక్ష్మీ నగర్ మండల అధ్యక్షులు ఊరగొండ అపర్ణ, అంతర్గాం మండల ప్రధాన కార్యదర్శి కొల్లూరి లక్ష్మణ్, జక్కన బాలు, గోల్లూరి పురుషత్తం, ధర్మాజీ శ్రీనివాస్,మీడివెల్లి అంజి, గుర్రాల మహేష్, తీగుట్ల నవీన్, దుంపేటి రాజు, శ్రీకాంత్, గద్దల మహేష్, కారుకూరి భరత్, తోటపల్లి శ్రీకాంత్, పైడిపల్లి విజయ్ గౌడ్,మాడ ప్రభాకర్, పరకాల మురళి,కొట్టే ప్రవీణ్, సంతోష్,జక్కుల పద్మ -ప్రవీణ్, అందె రాజ్ కుమార్ చారి, బుంగ మహేష్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బుడమేరులో ఇద్దరు గల్లంతు

**గల్లంతైన వారి కోసం గాలింపు ముమ్మరం**





**ఇబ్రహీంపట్నం, జూలై 20(వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి బుడమేరు కాలువలో ఇద్దరు వ్యక్తులు ఆదివారం సాయంత్రం గల్లంతయ్యారు. పోలీసుల కథనం ప్రకారం విశాఖపట్నానికి చెందిన ఎలుబంటి వాసు (23), బైనిబిల్లి కృష్ణారావు (50) కొండపల్లి పారిశ్రామికవాడలోని చార్మినార్ కంపెనీలో పనిచేస్తున్నారు. ఆదివారం సాయంత్రం కొండపల్లి శాంతి నగర్ వద్ద బుడమేరు కాలువలో సరదాగా స్నానానికి దిగి గల్లంత య్యారు. రాత్రి 9:00 గంటల సమయంలో సమాచారం అందుకున్న పోలీసులు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందిని రంగంలోకి దింపి గల్లంతైన వారి కోసం గాలిస్తున్నారు

**గల్లంతైన వారి కోసం గాలింపు ముమ్మరం** కొండపల్లి బుడమేరు కాలువలో గల్లంతైన వ్యక్తుల ఆచూకీ కోసం ఎస్డీఆర్ఎఫ్ బృందం సోమవారం గాలింపు చర్యలను ముమ్మరం చేసింది. ఆదివారం రాత్రి చీకట్లో గాలింపు చర్యలకు ఆటంకం కలిగింది. ఎస్డీఆర్ఎఫ్ బృందం సోమవారం ఉదయం ప్రత్యేక బోట్లు ద్వారా గాలింపు చర్యలు ప్రారంభించింది. గల్లంతైన ప్రాంతం నుంచి ఈలప్రోలు వరకు వెతుకులాడారు. సాయంత్రం వరకు గల్లంతైన వారి ఆచూకీ లభించలేదు. గాలింపు చర్యలను మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, ఇన్ చార్జి తహసీల్దార్ శ్రీనివాస మూర్తి, సీఐ ఎ.సుబ్రహ్మణ్యం, రెవెన్యూ సిబ్బంది పర్యవేక్షించారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

## బాధితులకు త్వరిత న్యాయం లక్ష్యం!!

- ఫిర్యాదులపై సత్వర చర్యలకు ఆదేశం
- ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి
- "గ్రీవెన్స్ డే"లో సీపీకి వినతులు



**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 20 (వార్తాప్రభ):** రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను పోలీస్ కమిషనర్ స్వయంగా స్వీకరించి, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాలకు చెందిన పలువురు ఫిర్యాదుదారులు తమ సమస్యలను సీపీ దృష్టికి తీసుకురాగా, సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో వెంటనే మాట్లాడి చట్టపరంగా పరిష్కరించాలని సూచించారు. ప్రజలకు పోలీస్ సేవలను మరింత చేరువ చేయడం, వారి సమస్యలను వేగంగా పరిష్కరించడం పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని సీపీ వివరించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారితో అధికారులు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను ఓర్పుతో విని అవసరమైతే క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి చట్ట ప్రకారం న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ విధానం ద్వారా ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం మరింత బలోపేతం అవుతుందని ఆయన తెలిపారు. బాధితులు తమ సమస్యలను నేరుగా పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావాలని, ప్రతి ఫిర్యాదును చట్టపరిధిలో పరిశీలించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. ఈ గ్రీవెన్స్ డే కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు

**-రాష్ట్ర మంత్రులు**



**శేరిలింగంపల్లి,జూలై 20 (వార్తాప్రభ):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు హైదరాబాద్ క్యూర్ పరిధిలో ఇళ్లు లేని పేదల కోసం తొలి విడతగా లక్ష ఎల్ఐజీ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి సోమవారం బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్,మహ్మద్ అజారుద్దీన్,క్యూర్ పరిధిలోని ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొన్నారు.ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తు విధానం, అర్హతలు,మార్గదర్శకాలతో రూపొందించిన బ్రోచర్‌ను పిఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ, గ్రామం నుంచి మహానగరం వరకు ప్రతి నిరుపేద కుటుంబానికి గౌరవప్రదమైన సొంతింటి కలను నెరవేర్చడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో గ్రామీణ ప్రాంతాల్లో 2.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో లక్ష ఇళ్లు కలిపి మొత్తం 3.50 లక్షల ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. గత ఏడాది మంజూరు చేసిన 4.50 లక్షల ఇళ్లతో కలిపి మొత్తం 8 లక్షలకు పైగా పేద కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేస్తున్నామని పేర్కొన్నారు.రాష్ట్రంలో గూడు లేని ప్రతి అర్హ కుటుంబానికి ఇల్లు అందే వరకు ఇందిరమ్మ ఇళ్ల యజ్ఞం నిరంతరం కొనసాగుతుందని చెప్పారు.హైదరాబాద్‌తో పాటు పట్టణ ప్రాంతాల్లోని పేదల కోసం కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను గుర్తించి,స్థానిక అవసరాలకు అనుగుణంగా బహుళ అంతస్తుల భవనాలు నిర్మించి ఇళ్లు అందజేస్తామని తెలిపారు.ప్రతి నియోజకవర్గాన్ని ప్రత్యేక యూనిట్‌గా తీసుకుని ఈ పథకాన్ని అమలు చేస్తున్నామని, దరఖాస్తుదారులు తమ నియోజకవర్గంలోనే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎలాంటి పైరవీలకు తావులేకుండా పూర్తిగా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరుగుతుందని స్పష్టం చేశారు.శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని గచ్చిబౌలి అంజయ్యనగర్‌లో నిర్మించిన 9 టవర్లలో మొత్తం 1,080 ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తున్నామని,అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ అవకాశాన్ని కల్పిస్తామని తెలిపారు.అల్పాదాయ వర్గాల కోసం మొదటగా ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్లను మంజూరు చేస్తున్నామని,మహిళల సాధికారతకు ప్రాధాన్యం ఇస్తూ ఇళ్ల పట్టాలను మహిళల పేర్లపైనే జారీ చేస్తామని చెప్పారు. పేదల సొంతింటి కలను సాకారం చేసే ఇందిరమ్మ ఇళ్ల పథకం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు.

# సంపాదకీయం

## జగన్ ఒంటరిగా కాదా...మాస్టర్ ప్లాన్ ఏంటి ?

సింహం సింగిల్ గా వస్తుంది. మేము ఒంటరిగానే ఒంటి చేత్తోనే ఎదుర్కొంటాం. ఇవన్నీ మాట్లాడేందుకు బాగానే ఉంటాయి. సినిమాలలో అయితే డైలాగులుగా బాగా పేలుతాయి. కానీ ఇది రాజకీయం. ప్రజలతో ముడిపడి ఉన్న ఫీల్డ్ ఇది. ప్రజా సమూహంతో చేసే రాజకీయంలో వ్యూహాలే కీలక పాత్ర పోషిస్తాయి. ఏ మాత్రం తేడా కొట్టినా కూడా సీన్ రివర్స్ అవుతుంది. వైసీపీ విషయం తీసుకుంటే 2014, 2019, 2024 ఎన్నికలు వేరు అని అంటున్నారు. ఆ మూడు ఎన్నికల్లో వైసీపీ మూడు రకాలుగా విభిన్నమైన రాజకీయ భూమికలను పోషించింది. కానీ ఈసారి 2029 లో మాత్రం వైసీపీకి ఒక అగ్ని పరీక్షగానే ఉండబోతోంది అని అంటున్నారు. విశ్లేషకులు సైతం ఇదే మాట చెబుతున్నారు. చాన్స్ తీసుకోవాలంటే మరో చాన్స్ ఉండాలి. కానీ వైసీపీకి 2029 ఎన్నికలు చాలా కీలకం అని ఎవరూ ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. తమిళనాడులో అన్నా డీఎంకే లాంటి ఢక్కామెక్కీలు తిన్న పార్టీయే వరసగా రెండు సార్లు ఓటమి చెందిన తరువాత చీలికలు పీలికలు అయిపోతున్న నేపథ్యం ఉంది. ఒక్కసారి ఓటమికే నిన్నటిదాకా అధికారంలో ఉన్న డీఎంకే తృణమూల్ కాంగ్రెస్ లలో కూసాలు కదులుతున్న నేపథ్యం ఉంది. వైసీపీ విషయం తీసుకుంటే ఆ పార్టీకి అతి పెద్ద బలం బలగం జగన్ అన్నది నిజం. ఆయనను అల్లుకుని ఆయన చుట్టూనే ఉన్న పార్టీ వైసీపీ. అందుకే జగన్ ని విశ్వసిస్తూ వైసీపీ నేతలు అంతా 2029 కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. అయితే 2029 ఎన్నికల్లో వైసీపీ రిస్క్ ఏ విధంగానూ తీసుకోకూడదని పార్టీ వారు అంతా సూచిస్తున్నారు అని అంటున్నారు. వైసీపీ ఒంటరిగా పోటీ పడడం ఏ విధంగా చూసినా 2029 ఎన్నికల్లో రిస్క్ అని అంటున్నారు. ఎందుకంటే కూటమి అవతల మూడు పార్టీలతో బలంగా ఉంది. వారి ముగ్గురు ఓటు షేర్ కలిస్తే 2024 ఎన్నికల్లో 56 శాతం పైగా వచ్చింది. వైసీపీ ఓటు షేర్ 40 శాతం ఉంది. తేడా భారీగానే ఉంది. అయిదేళ్ళ తరువాత యాంటీ ఇంకెంబెన్సీ ఉందనుకున్నా కూటమికి అయిదారు శాతం ఓట్లు తగ్గుతాయని భావించినా వైసీపీ ఆ మేరకు మరో అయిదారు శాతం పెంచుకుంటుందని లెక్కలేసినా రెండూ సమ ఉజ్జీలుగా మారి పోరు హోరా హోరీ అవుతుందని కూడా విశ్లేషణలు ఉన్నాయి. ఈ క్రమంలో కలసి వచ్చిన పార్టీలు చిన్నవో పెద్దవో అయినా సరే ముందుకు వెళ్తే ఒకటీ అరా శాతం ఓటు షేర్ కూడా రేపటి ఎన్నికల్లో భారీగా ఫలితాల మార్పునకు కారణం అవుతుందని అంటున్నారు. ఈ క్రమంలోనే నోరున్న పార్టీలు జనంలో ప్రభావితం చేసే పార్టీలుగా వామపక్ష పార్టీలను వైసీపీ భావిస్తోంది అని అంటున్నారు. ఈ రెండు పార్టీలు కూటమి మీద పోరు చేస్తున్నాయి. వైసీపీ లేవనెత్తుతున్న అంశాలనే ఆ పార్టీలు కూడా నిలదీస్తున్నాయి. సీపీఎం సీపీఐ జనంలో ఆందోళనలు చేస్తూ ప్రజలను చైతన్యం చేస్తున్నాయి. దాంతో తమతో భావ సారూప్యం ఉన్నందువల్ల ఉభయ కమ్యూనిస్టు పార్టీలతో కలసి ముందుకు సాగితే మేలు జరుగుతుందని వైసీపీ ఆలోచిస్తోంది అని అంటున్నారు. మరింత గట్టిగా కూటమి సర్కార్ ని నిలదీసేందుకు కూడా ఆస్కారం ఏర్పడుతుందని కూడా లెక్క వేస్తోంది అని అంటున్నారు. ఇక ఈ మధ్య కాలంలో వామపక్షాల స్వరంలోనూ మార్పు కనిపిస్తోంది. వైసీపీని గొడ్డలి పార్టీని అని పదే పదే చంద్రబాబు విమర్శించడం మీద సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ మండిపడ్డారు. ఒకసారి అధికారంలోనూ రెండు సార్లు ప్రతిపక్షంలోనూ ఉన్న పార్టీని పట్టుకుని ఆ విధంగా ఎలా అంటారు అని ఆయన నిలదీశారు. ఇక సీపీఎం సైతం వైసీపీతో పనిచేసేందుకు ఆసక్తిగా ఉందని ప్రచారం సాగుతోంది. విభజన ఏపీలో వరసగా మూడు ఎన్నికలు జరిగినా వామపక్షాలకు అసెంబ్లీలో ఎక్కడా ప్రాతినిధ్యం లేదు. దాంతో వచ్చే ఎన్నికల్లో పొత్తు పెట్టుకుని అయినా అసెంబ్లీలోకి ప్రవేశించాలని ఈ పార్టీలు చూస్తున్నాయి. వైసీపీ కూడా ఎర్రన్నలను కలుపుకుంటే కూటమిని మరింత బలంగా ఢీ కొట్టగలమని భావిస్తోంది అని అంటున్నారు. చూడాలి మరి ఈ ఊహాగానాలు ఎపుడు నిజం అవుతాయో.

## ప్రశ్న రావణ్ పై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి

**కొత్తపేట సి ఐ కొండలరావు కి పిర్యాదు చేసిన విశ్వహిందూ పరిషత్ భాద్యులు**



**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కూటమి ప్రభుత్వం పాలకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ యూ ట్యూబ్ లో వీడియో పెట్టిన ప్రశ్న రావణ్ పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని విజయవాడ విశ్వహిందూ పరిషత్ భాద్యులు ఆదివారం రాత పూర్వక పిర్యాదుని కొత్తపేట సి ఐ కి అందించారు. ఈ దేశాన్ని, సనాతన ధర్మాన్ని, -40లీ డిగ్రీల ఉష్ణోగ్రతలో దేశ రక్షణకోసం, దేశ ప్రజల భద్రత కోసం అనుక్షణం కంటికి రెప్పలా కుటుంబాలను, ప్రాణాలను సైతం పణంగా పెట్టి కాపాడుతున్న దేశ సైన్యాన్ని అవహేళనగా మాట్లాడుతూ, ఉగ్రవాదులను మరియు నక్సలైట్లను దేశ భక్తులుగా అభివర్ణిస్తూ దేశ సార్వభౌమత్వాన్ని మరియు దేశ సమగ్రతను భంగం కలిగించేవిధంగా మాట్లాడుతున్న రావణ్ పై తగిన చర్యలు తీసుకోవాలని వారా ఫిర్యాదులో పేర్కొన్నారు. మతవిద్వేషాలను రెచ్చగొడుతూ సంఘవిద్రోహ శక్తులకు ఊతమిచ్చే విధంగా మాట్లాడుతూ, సనాతన ధర్మాన్ని వ్యంగంగా మాట్లాడటమే కాకుండా, ఈ రాష్ట్ర ముఖ్యమంత్రిని, డిప్యూటీ సీఎం మీద కూడా తన సొంత యూట్యూబ్ ఛానెల్ ద్వారా అనుచిత వ్యాఖ్యలు చేసిన జోసెఫ్ రావణ్ అలియాస్ (ప్రశ్న రావణ్) మీద క్రిమినల్ చర్యలు తీసుకొని ఎఫ్ ఐ ఆర్ నమోదు చేయవలసిందిగా ఆదివారం రాత్రి లకు విశ్వ హిందూ పరిషత్ విజయవాడ మహానగర్ దుర్గ ప్రఖండలోని 2టౌన్ పోలీస్ స్టేషన్ సి ఐ కి కంప్లైంట్ ఇవ్వటం జరిగింది. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ విజయవాడ సహా కార్యదర్శి కొంపెల్లి శ్రీనివాస్, బజరంగ్ దల్ కార్యకర్తలు అజయ్, మల్లేష్, కుమార్, జగన్, పవన్ పాల్గొన్నారు.

# జక్కంపూడి కాలనీ పై పోలీసులు ప్రత్యేక దృష్టి, నిరంతర నిఘా

- కాలనీ పై ప్రజల్లో ఉన్న నేరాలు ఘోరాలు, గంజాయి స్మగ్లింగ్ అపవాదు నుండి బయట పడేసే ప్రయత్నం లో పోలీసులు
- జక్కంపూడి కాలనీ అంటే నేరస్తుల కాలనీ కాదని చాటి చెప్పండి
- వెస్ట్ జోన్ ఏ సి పి ఎన్ ఎస్ వి కే దుర్గా రావు





**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ వెస్ట్ జోన్ పరిధిలోని కొత్తపేట పోలీసు స్టేషన్ అధికారులకు సమస్యాత్మక ఏరియా గా, అన్ని రకాలుగా నేరస్తుల అడ్డాగా గంజాయి బ్యాచ్ చిరునామా ప్రచారం జరుగుతోన్న జక్కంపూడి కాలనీ పై వున్న చెడు ముద్ర, అపవాదు లనుండి బయట పడేలా ప్రతి ఒక్కరూ మార్పు దిశగా అడుగులు వేయాలనివిజయవాడ సిటీ పశ్చిమ డివిజన్ ఏసీపీ దుర్గారావు పిలుపునిచ్చారు. విజయవాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ కొండలరావు , ఎస్ఐలు మరియు పోలీసు సిబ్బందితో కలిసి వైఎస్ఆర్ కాలనీలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఎన్యూమరేషన్ (కుటుంబ సర్వే) కార్యక్రమంలో భాగంగా కాలనీ వాసులతో అవగాహన సమావేశం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ శ్రీ దుర్గారావు మాట్లాడుతూ, వైఎస్ఆర్ కాలనీకి గతంలో కొన్ని నేర ఘటనల కారణంగా చెడు పేరు వచ్చిందని, ఎక్కడైనా సెల్‌ఫోన్ దొంగతనాలు, ద్విచక్ర వాహనాల దొంగతనాలు వంటి ఘటనలు జరిగినప్పుడు వైఎస్ఆర్ కాలనీ పేరు ప్రస్తావనకు రావడం బాధాకరమని, కాలనీ పై ఉన్న ఈ ప్రతికూల ముద్రను తొలగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏ సి పి దుర్గారావు హితవు పలికారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరితో కలిసి తిరుగుతున్నారు, వారి స్నేహితులు ఎవరు, రోజువారీ కార్యకలాపాలు ఎలా ఉన్నాయనే విషయాలను ఎప్పటికప్పుడు గమనించాలని సూచించారు. పిల్లలకు మంచి విలువలు, క్రమశిక్షణ అలవర్చడంతో పాటు విద్య, ఉపాధి మరియు క్రీడల వైపు ప్రోత్సహించి, నేరాలకు దూరంగా ఉండేలా మార్గనిర్దేశం చేయాలని తెలిపారు. అదేవిధంగా, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. సైబర్ నేరం బారిన పడిన వెంటనే 1930 కు ఫోన్ చెయ్యాలని, పోక్సో చట్టం గురించి అవగాహన కల్పిస్తూ, బాలబాలికలపై లైంగిక వేధింపులు, దుర్వినియోగం వంటి చర్యలు అత్యంత తీవ్రమైన నేరాలని , పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, పిల్లలకు మంచి స్పర్శ--చెడు స్పర్శ గురించి అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. ఎలాంటి అనుమానాస్పద సంఘటన జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలనిసూచించారు సమాజం లో శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, అనుమానాస్పద వ్యక్తులు, నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని, పోలీసులకు సహకరించి సురక్షితమైన, నేర రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ సి పి తో పాటుగా కొత్తపేట సి ఐ కొండలరావు ఎస్ ఐ లు, పాల్గొన్నారు

# మహిళలఆడబిడ్డల ఆర్తనాదాలువినిపించవా చంద్రబాబు?

- మహిళల భద్రతలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలం
- నిందితులకు భయం లేకుండా పోయిందిమహిళలకు రక్షణ కరువైంది రాష్ట్ర హోంమంత్రికి కనపడటం లేదా
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి బాజీ బాబా




**విజయవాడ పశ్చిమ జులై 20 :,(వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలమీద మహిళలపైదాడులు అత్యాచారాలుహత్యలు పెరిగిపోతున్నాయని రాష్ట్ర వైసీపీ మైనార్టీ కార్యదర్శి బాజీ బాబా తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గుంటూరు నగరంలో ఇటీవల ఒక మహిళపై జరిగిన దారుణ ఘటన రాష్ట్రంలో మహిళల భద్రత ఎంత దయనీయంగా మారిందో చెప్పడానికి నిద ర్శనమని అన్నారు. మహిళలపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం సకాలంలో స్పందించకపోవడం దారుణ మని ఆయన విమర్శించారు రాష్ట్రంలోగంజాయి, డ్రగ్స్, మద్యం విచ్చలవిడిగా అందుబాటులో ఉండటం వల్ల యువతలో నేరప్రవృత్తి పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నేరాలను అరికట్టాల్సిన పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గుతున్నారనే భావన ప్రజల్లో ఏర్పడుతోందని అన్నారు. మహిళలపై దాడులకు పాల్పడే నిందితులకు చట్టం, పోలీసులంటే భయం లేకుండా పోయిందని బాజీ బాబా విమర్శించారు. మహిళలపై దాడి జరిగిన వెంటనే నిందితులను అరెస్టు చేసి, బాధితులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వం రాజకీయ ప్రయోజనాలకోసంవ్యవహరిస్తోందని ఆరోపించారు. నిందితులు ఎంతటి వారైనా చట్టం ముందు సమానమేనని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని అన్నారు. గుంటూరు నగరంలో మహిళపై జరిగిన దాడి ఘటనపై ప్రభుత్వం తక్షణమే సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. బాధిత మహిళకు పూర్తి రక్షణ కల్పించడంతో పాటు, ఆమెకు వైద్య, న్యాయ సహాయం అందించాలని కోరారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని అన్నారు. మహిళల భద్రత కోసం మాజీముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళల భద్రతకు. దిశ చట్టాన్ని అమలు చేసిందని. బాజీ బాబా గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో మహిళల రక్షణకు ప్రాధాన్యత ఇచ్చి, మహిళా పోలీస్ వ్యవస్థను బలోపేతం చేయడంతో పాటు, మహిళలకు భద్రత కల్పించే అనేక చర్యలు చేపట్టామని తెలిపారు. మహిళలు, బాలికలపై వేధింపులు, దాడులను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఒకవైపు మహిళల భద్రతపై గొప్పలు చెప్పుకుంటూ, మరోవైపు మహిళలపై దాడులు జరుగుతున్నా నిందితులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం ప్రజలను ఆందోళనకు గురిచేస్తోందని అన్నారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలపై వైఎస్సార్‌సీపీ మౌనంగా ఉండదని బాజీ బాబా స్పష్టం చేశారు. బాధిత మహిళలకు న్యాయం జరిగే వరకు, రాష్ట్రంలో మహిళలకు సంపూర్ణ భద్రత కల్పించే వరకు వైఎస్సార్‌సీపీ ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం ఇకనైనా మేల్కొని, నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

# ఆండ్రుస్ మెమోరియల్ సొసైటీ సేవలు ప్రశంసనీయం

**మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు**








**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మానవసేవే మాధవసేవ అనే గొప్ప సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ... గత 13 ఏళ్లుగా నిరంతరాయంగా పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్న ఆంధ్రూస్ మెమోరియల్ సొసైటీ సేవలు ప్రశంసనీయమని మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాసరావు ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.ఎస్. బేగ్ లు కొనియాడారు. సమాజ సేవలో దివంగత రెవరెండ్ కొమ్మ ఆంద్రూస్ సౌభాగ్య కుమార్ అందించిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ నిర్వహిస్తున్న ఈ ఉచిత మెగా మెడికల్ క్యాంప్ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా మారిందని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగించాలని నిర్వాహకులను అభినందిస్తూ ఆకాంక్షించారు. ఫ్రైజర్ పేట తెలుగు బాప్టిస్ట్ చర్చి సంఘ కాపరిగా దాదాపు మూడు దశాబ్దాల పాటు విశిష్ట సేవలందించిన దివంగత రెవరెండ్ కొమ్మ ఆంద్రూస్ సౌభాగ్య కుమార్ జ్ఞాపకార్థం, ఆయన కుమారుడు పాస్టర్ రెవరెండ్ కొమ్మ నిక్సన్ ఆంద్రూస్, అనూష నిక్సన్ ఆధ్వర్యంలో ఆంద్రూస్ మెమోరియల్ సొసైటీ నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా జరిగింది. ఈ మెగా మెడికల్ క్యాంప్‌కు మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.ఎస్. బేగ్‌తో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, సామాజిక సేవకులు, మత పెద్దలు ముఖ్య అతిథులుగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో వివిధ విభాగాలకు చెందిన నిపుణులైన వైద్యులు ప్రజలకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సాధారణ వైద్యం, గుండె సంబంధిత పరీక్షలు, మధుమేహం, రక్తపోటు, నేత్ర పరీక్షలు, మహిళల ఆరోగ్య పరీక్షలు తదితర వైద్య సేవలను వందలాది మంది కి అందించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు, ఆరోగ్య సంరక్షణపై వైద్యులు విలువైన సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్... సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వారికి ఆరోగ్య సేవలను చేరువ చేయడం గొప్ప సేవ అని అన్నారు. గత 13 సంవత్సరాలుగా ఎలాంటి విరామం లేకుండా వేలాది మందికి వైద్య సేవలు అందిస్తున్న ఆంద్రూస్ మెమోరియల్ సొసైటీ సేవాభావం ఆదర్శనీయమని కొనియాడారు. దివంగత రెవరెండ్ కొమ్మ ఆంద్రూస్ చూపిన సేవా మార్గాన్ని ఆయన కుటుంబ సభ్యులు అదే నిబద్ధతతో కొనసాగించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఎం.ఎస్. బేగ్ మాట్లాడుతూ... మతానికి అతీతంగా మానవత్వాన్ని చాటిచెప్పే ఇలాంటి కార్యక్రమాలు సమాజానికి ఎంతో అవసరమన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించడం నిజమైన సామాజిక సేవ అని చెప్పారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం పాస్టర్ రెవరెండ్ కొమ్మ నిక్సన్ ఆంద్రూస్, అనూష నిక్సన్ తమ సంఘ ప్రజలకు కోసం ప్రతి ఏటా క్రమం తప్పకుండా ఈ మెగా మెడికల్ క్యాంపులో నిర్వహిస్తున్నామని చెప్పారు. రాబోయే రోజుల్లో కూడా ఈ సేవా కార్యక్రమాన్ని అందరి సహకారంతో కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, వైద్యులు, సంఘ నాయకులు సైతం ఆంద్రూస్ మెమోరియల్ సొసైటీ చేస్తున్న సేవలను అభినందించారు. శిబిరానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై ఆరోగ్య పరీక్షలు చేయించుకుని ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. సేవా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులకు స్థానికులు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శింగరి హాస్పిటల్, శ్రీకర హాస్పిటల్, స్వర హాస్పిటల్ మల్లెపూడి, సంధ్య హాస్పిటల్, వైద్యులు, రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ చైర్మన్ కసునూరి నాగులమీరా, ఎన్టీఆర్ జిల్లా బిజెపి అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి పత్తిపాటి శ్రీధర్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోతిన వెంకట మహేష్, మాజీ కార్పొరేటర్ బుల్ల విజయ్ కుమార్, తెలుగు బాప్టిస్ చర్చి ఎగ్జిక్యూటివ్ కమిటీ వారు చైర్మన్ రెడ్డి బోయిన మోజస్ సెక్రటరీ బూదాల విక్టర్ జోసఫ్, ట్రెజరర్ కటికల కిషోర్ కుమార్ , జాయింట్ సెక్రెటరీ బూదాల శ్రీనివాసరావు , జాయింట్ ట్రజరర్ వినుకొండ కార్తీక్ పాల్గొన్నారు.

## శ్రీదేవి కరుమారి అమ్మవారికి శక్తిపీఠంలో వైభవంగా ఆషాడ గుప్త వారాహి నవరాత్రులు





**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ సి వి ఆర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి దిగువన తూర్పు వైపు ఉన్న శ్రీదేవి కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో ఈ నెల 15 నుండి 23 వరకూ ఆషాఢ గుప్త వారాహి నవరాత్రులు అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ కారుణానంద నాద తెలిపారు. ఈ నవరాత్రుల ఉత్సవాలు సందర్భంగా సోమవారం శ్రీదేవి కరుమారి అమ్మవారు శ్రీ లఘువారాహి అమ్మవారి రూపంలో దర్శనమిచ్చారు. ప్రతిరోజు అమ్మవారికి హోమములు సహస్రనామార్చనలు జరుగుతున్నాయి. ప్రతిరోజు అమ్మవారికి ఆషాఢ సారే కూడా సమర్పించడం జరుగుతుంది. ప్రతిరోజు వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శిస్తున్నారు. ప్రతిరోజూ అమ్మవారి ప్రత్యేక అలంకరణలో పురవీధుల్లో రథంపై వూరేగింపు కార్యక్రమం నిర్వహిస్తున్నారు. దారెంట అమ్మవారికి భక్తులు భక్తి శ్రద్ధలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో విజయవాడ నగర ప్రముఖులు చలవాది ప్రకాష్ దంపతులు, కొరగంజి ప్రభాకర్ రావు దంపతులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.

## ప్రతి ఫిర్యాదుకు సంతృప్తికరమైన పరిష్కారం అందించాలి




**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో అదనపు కమిషనర్ డాక్టర్ డి. చంద్రశేఖర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు వినిపించే ప్రతి ఫిర్యాదును అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి, సమస్యకు తాత్కాలిక పరిష్కారం కాకుండా శాశ్వత పరిష్కారం చూపేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఫిర్యాదుదారులకు వారి సమస్య పరిష్కారం వివరించడమే కాకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ వారపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 20 అర్జీలు స్వీకరించారు. వాటిలో పట్టణ ప్రణాళిక శాఖకు సంబంధించినవి 8, ఇంజనీరింగ్ శాఖకు 2, పబ్లిక్ హెల్త్‌కు 2, రెవెన్యూ శాఖకు 3, యూసీడీ విభాగానికి 2, హౌసింగ్‌కు సంబంధించినవి 2, ఇతర శాఖకు సంబంధించినది 1 ఫిర్యాదు ఉంది. సంబంధిత శాఖల అధికారులు అర్జీలను స్వీకరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్లు ఏ. రవీంద్రరావు, కె. శకుంతల, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ (ఇన్‌చార్జి) డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, చీఫ్ ఇంజనీర్ సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) సృజన, డిప్యూటీ సిటీ ప్లానర్ చంద్రబోస్, పర్యవేక్షణ ఇంజనీర్లు చంద్రశేఖర్, కె. దుష్యంత్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ. శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ (హార్టికల్చర్) చంద్రశేఖర్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నరేష్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్, బయాలజిస్ట్ సూర్యకుమార్ నాయక్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారమే ప్రజా దర్బార్ లక్ష్యం..




**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకే ఎమ్మెల్యే సుజనా చౌదరి నిరంతరం ప్రజా దర్బార్ లను నిర్వహిస్తున్నారని మాజీ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్ , టీడీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పిళ్ళా శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు పోతిన భేసు కంటేశ్వరుడు అన్నారు..ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆదేశాలతో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, కూటమి నేతలతో కలిసి భవానిపురం ఎన్డీయే కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ లకు విశేష స్పందన లభిస్తోంది .ప్రజలు తమ వినతులను రేషన్ కార్డులు, పింఛన్లు ఇళ్ల స్థలాలు, వైద్య సహాయం వంటి తదితర సమస్యలపై దరఖాస్తు రూపంలో అందజేశారు. వచ్చిన అర్జీలను స్వయంగా పరిశీలించి అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్ లో మాట్లాడి సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నారు. రాజకీయాలకతీతంగా, ప్రజాసేవే ధ్యేయంగా, ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకుని పరిష్కరిస్తున్నామనిమాజీ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్ , టీడీపీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పిళ్ళా శ్రీనివాస్, బీజేపీ సీనియర్ నాయకులు పోతిన భేసు కంటేశ్వరుడు అన్నారు...టీడీపీ సీనియర్ నాయకులు కామ దేవరాజ్, గుజ్జారి అమర్ బాబు, ఆకారపు విజయ కుమారి, ప్రభు చరణ్ తదితరులు పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు..

## ముఖ్యమే ధైర్యము




గుండెలోని ధైర్యము
విలువైన నమ్మకము
ఎదిగేందుకు నిచ్చెన
ఎడతెగని అభ్యాసము
మోవిపై చిరునవ్వులు
పూసిన సిరిమల్లెలు
వెదజల్లును సొగసులు
మురిపించును మనసులు
ప్రేమలొలుకు పలుకులు
చూడ జుంటెతేనెలు
దోచునోయి హృదయాలు
వెలిగించు జీవితాలు
పలకరింపు ముఖ్యము
బలపరచును బంధము
నలుదిశల వ్యాపించు
జీవితాన గంధము

-గద్వాల సోమన్న,
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# ఆంధ్రూస్ మెమోరియల్ సొసైటీ ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన...

## 1000 మందికి ఆరోగ్య పరీక్షలు. ఉచితంగా మందులు పంపిణీ..





**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఆంధ్రూస్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో,ఫ్రైజర్ పేట,తెలుగు బాప్టిస్ట్ చర్చ్ విశ్వాస నిలయంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది ...కొమ్ము ఆంధ్రూస్ సౌభాగ్య కుమార్ 14 వ వర్ధంతి సందర్భంగా నిర్వహించిన ఈ శిబిరం లో డెంటల్, కంటి, ఆర్థోపెడిక్, ఈ ఎన్ టి, మూత్రపిండాల సంబంధిత సమస్యలకు నిపుణులైన వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.. సుమారు 1000 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకొని వైద్య సేవలు పొందారు.. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ బుల్లా విజయ్ కుమార్, టీడీపీ సీనియర్ నాయకులు కామ దేవరాజ్, యస్ సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ పల్లెపోగు ప్రసాద్ మాట్లాడుతూ పేద మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించడంలో ఆంధ్రూస్ మెమోరియల్ సొసైటీ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు.. పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, “సుజనా ఫౌండేషన్” ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు కొనసాగిస్తూ, ప్రజా ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ఉచిత మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. స్వర్గీయ కొమ్ము ఆంధ్రూస్ సౌభాగ్య కుమార్ సేవాస్ఫూర్తిని కొనసాగిస్తూ ప్రతి సంవత్సరం ఉచిత వైద్య సేవలను నిర్వహించడం అభినందనీయమన్నారు.. పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, పాస్టర్ నిక్సన్ ఆంధ్రూస్, అనూష నిక్సన్, ఎస్సీ సెల్ నాయకులు చిలకా భగవాన్ , దీపంగి మధు తదితరులు విక్టోరియా, బుధాల జ్యోతి పర్యవేక్షించారు.. మల్లెపూడి పాలీ క్లినిక్, శిశీగరి ఈ ఎన్ టి, శ్రీకర హాస్పిటల్స్, సంధ్య కంటి ఆసుపత్రి వైద్యులు తమ సేవలందించారు..

# భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పార్వేట ఉత్సవం





**చంద్రగిరి : జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శ్రీవేంకటేశ్వరస్వామివారు నడిచిన పవిత్ర మార్గంగా భక్తులు విశ్వసించే శ్రీవారిమెట్టు సమీపంలోని శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి పార్వేట ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తజన సందోహంతో కళకళలాడగా, భక్తి, ఆధ్యాత్మికత వెల్లివిరిసింది. ఉదయం 7 గంటలకు ఆలయం నుంచి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ ఘనంగా ఊరేగింపుగా తీసుకువెళ్లి, శ్రీవారిమెట్టు సమీపంలోని పార్వేట మండపానికి చేర్చారు. అక్కడ క్షేమతలిగ నివేదన అనంతరం సంప్రదాయబద్ధంగా పార్వేట ఉత్సవాన్ని నిర్వహించారు. దుష్టశిక్షణకు, ధర్మరక్షణకు ప్రతీకగా స్వామివారు మూడుసార్లు బల్లెంను ప్రయోగించే విశిష్ట ఘట్టం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం ఆస్థానం నిర్వహించగా, సాయంత్రం ఉత్సవమూర్తులను తిరిగి ఆలయానికి శోభాయాత్రగా తీసుకువచ్చారు.పార్వేట ఉత్సవం సందర్భంగా టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు అన్నమయ్య సంకీర్తనలను ఆలపించి భక్తులను భక్తిరసంలో ముంచెత్తారు. భజన బృందాలు భజనలు, కోలాటాలతో ఆధ్యాత్మిక వాతావరణాన్ని మరింత ఉట్టిపడేలా చేశాయి. అనంతరం శ్రీవారిమెట్టు సమీపంలో విచ్చేసిన భక్తులకు అన్నప్రసాదాలను భక్తిశ్రద్ధలతో పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో జేఈవో డా. ఎ. శరత్, ఆలయ ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈవో శ్రీమతి వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్ రాజ్‌కుమార్, ఆలయ అర్చకులు బాలాజీ రంగాచార్యులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు మునికుమార్, ధనశేఖర్ జయ, ఆర్చితం ఇన్స్పెక్టర్ ధన శేఖర్, ఆలయ ప్రధాన అర్చకులు నారాయణ ఆచార్యులు, బాలాజీ రంగకుమార్ ఇతర అధికారులు, అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# విద్యార్థికి ఘన సత్కారం - ఆర్థిక సాయం చేసిన సమతా హెల్ప్ లైన్



**ఆత్మకూరు జూలై 20 (వార్తాప్రభ)**ఇంటర్మీడియట్ 2025 26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఫలితాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థి వేణు.అంతే కాకుండా భారతదేశంలో ఇంజనీరింగ్ కోర్సు ప్రవేశానికి నిర్వహించే జాతీయ స్థాయి ప్రవేశ పరీక్ష జేఈఈ మెయిన్లో మంచి ర్యాంకు సాధించి తిరుపతి ఐఐటిలో స్థానం సాధించిన వేణును సమతా హెల్ప్ లైన్ సభ్యులు సత్కరించి మరియు నున్న సంతోష్ ఆర్థిక ఆర్థిక సహాయం అందించడం జరిగినది.ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి పట్టుదలతో జేఈఈమెయిన్ ర్యాంక్ సాధించడం ఎంతో గర్వకారణమని వేణును పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో సమత హెల్ప్ లైన్ సభ్యులు మరియు కాలేజ్ ప్రిన్సిపాల్ కాలేజ్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగినది.

# విజయానికి పాఠ్యపుస్తకాలే బలమైన పునాది

## ఇతరులతో పోల్చుకోవద్దు.




**మచిలీపట్నం జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**‘షైనింగ్ స్టార్స్--2026’లో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాల ప్రదానం చేసిన జిల్లా కలెక్టర్ డీకే బాలాజి.విద్యార్థులు పాఠ్యపుస్తకాలను లోతుగా చదివే అలవాటు పెంపొందించుకోవాలని, నోట్స్‌పై మాత్రమే ఆధారపడకుండా స్వయంగా చదివి అర్థం చేసుకునే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజి విద్యార్థులకు ఉద్బోధించారు.సోమవారం స్థానిక జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన షైనింగ్ స్టార్స్--2026 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, విలువైన పుస్తకాలను అందజేసి అభినందించారు.కృష్ణా జిల్లాలో ఈ ఏడాది మొత్తం 217 మంది విద్యార్థులు షైనింగ్ స్టార్స్‌గా ఎంపికయ్యారు. వీరిలో పదో తరగతికి చెందిన 168 మంది, ఇంటర్మీడియట్‌కు చెందిన 49 మంది ఉన్నారు. ఎంపికైన ప్రతి విద్యార్థికి రూ.20 వేల నగదు బహుమతి, పతకం, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ఇందుకోసం జిల్లాలో మొత్తం రూ.43.40 లక్షలు ప్రోత్సాహకంగా పంపిణీ చేశారు.అనంతరం విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో చదివిన తన విద్యార్థి దశ అనుభవాలను పంచుకున్నారు. పాఠ్యపుస్తకాలను స్వయంగా చదివి అర్థం చేసుకునే అలవాటు తన విజయానికి బలమైన పునాది అయిందన్నారు. క్రమశిక్షణ, సమయపాలన, నిరంతర శ్రమ, ఆత్మవిశ్వాసం విజయానికి కీలకమని చెప్పారు. మార్కుల కంటే నేర్చుకునే సామర్థ్యం ముఖ్యమని, ఇతరులతో పోల్చుకుంటూ అనవసర ఒత్తిడికి గురికాకుండా, నిన్నటి తనకంటే ఈరోజు మెరుగ్గా ఉండాలనే లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు.కార్యక్రమంలో పాల్గొన్న ఏపీఎస్ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు మాట్లాడుతూ, పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను గుర్తించి ఒక్కొక్కరికి రూ.20 వేల నగదు బహుమతి అందించడం ద్వారా వారి ప్రతిభకు గౌరవం లభిస్తుందని అన్నారు. ఇలాంటి గుర్తింపు విద్యార్థుల్లో మరింత ఆత్మవిశ్వాసాన్ని పెంచి ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తుందన్నారు. ఈ పురస్కారాలు అందుకున్న విద్యార్థులతో పాటు, ఇతర విద్యార్థులకు కూడా ప్రేరణగా నిలిచి మరింత కష్టపడి చదివేలా చేస్తాయని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తెలుగు భాషను నేర్చుకుని ప్రజలతో మమేకమవుతూ విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని కొనియాడిన కొనకళ్ల నారాయణరావు, పాఠశాలల సందర్శనల ద్వారా విద్యా ప్రమాణాల మెరుగుదలకు కలెక్టర్ తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని అన్నారు.కార్యక్రమంలో డీఈవో యు వి సుబ్బారావు, డిఐఈఓ సరళ, సమగ్ర శిక్ష ఏపీసి ఆర్ కుముదిని సింగ్, రాష్ట్ర గిడ్డంగుల నిర్వహణ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి, ఏపీ నాటక అకాడమీ చైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, మచిలీపట్నం మార్కెట్ యార్డ్ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ నాని, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపీచంద్, డిప్యూటీ డీఈవోలు శేఖర్ సింగ్, పద్మారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పింగళి వెంకయ్య ప్రభుత్వ వైద్య కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రేణుకాదేవి బాధ్యతల స్వీకరణ



**మచిలీపట్నం జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పింగళి వెంకయ్య ప్రభుత్వ వైద్య కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రేణుకాదేవి సోమవారం బాధ్యతలు స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ జి. భానుమూర్తి, డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ భరత్ సింగ్ నాయక్ నూతన ప్రిన్సిపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.బాధ్యతలు స్వీకరించిన అనంతరం డాక్టర్ రేణుకాదేవి మాట్లాడుతూ, తాను మెడికల్ కళాశాల ప్రాంగణంలోనే నివాసం ఉంటూ కళాశాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన వైద్య విద్య అందించడంతో పాటు, కళాశాల మౌలిక సదుపాయాల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.ప్రభుత్వ వైద్య కళాశాలను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధ్యాపకులు, వైద్యులు, సిబ్బంది అందరి సహకారంతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు. కళాశాల పురోగతికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని ఆమె స్పష్టం చేశారు.

# శ్రీసిటీలోని అకార్డ్ స్కూల్ కు కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ గుర్తింపు

## - స్కూల్ యాజమాన్యాన్ని అభినందించిన మంత్రి లోకేష్



**తిరుపతి : జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీసిటీలోని అకార్డ్ స్కూల్‌కు యుకె కు చెందిన ప్రతిష్ఠాత్మక కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ గుర్తింపు లభించింది. దీనిని అధికారికంగా ధృవీకరిస్తూ IA770 కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ నంబర్‌ను కేటాయించారు. దీంతో అకార్డ్ స్కూల్లో ఇకపై కేంబ్రిడ్జ్ ప్రైమరీ (5--11 ఏళ్లు), కేంబ్రిడ్జ్ లోయర్ సెకండరీ (11--14 ఏళ్లు) విద్యా కార్యక్రమాలను అమలుచేయనున్నారు. ఈ గుర్తింపుతో విద్యార్థులకు ప్రపంచ ప్రమాణాలకు అనుగుణమైన పాఠ్యాంశాలు, అంతర్జాతీయ స్థాయి కేంబ్రిడ్జ్ చెక్‌పాయింట్ అసెస్‌మెంట్లు, ఉన్నత విద్యతో పాటు గ్లోబల్ అవకాశాలకు అవసరమైన నైపుణ్యాలను అందించే అవకాశం కలుగుతుంది. సృజనాత్మకత, విశ్లేషణాత్మక ఆలోచన, పరిశోధనాత్మక దృక్పథాన్ని పెంపొందించే విధంగా ఈ పాఠ్య ప్రణాళిక రూపొందించబడి ఉంటుంది. ఈ సందర్భంగా అకార్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ బృందా త్యాగరాజన్ మాట్లాడుతూ, కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్స్ నెట్‌వర్క్‌లో భాగస్వామ్యం కావడం తమకు గర్వకారణమని తెలిపారు. విద్యార్థులను స్థానికంగానే కాకుండా అంతర్జాతీయ స్థాయిలోనూ రాణించేలా తీర్చిదిద్దే విద్యను అందించేందుకు ఈ గుర్తింపు దోహదపడుతుందని చెప్పారు.శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి దీనిపై స్పందిస్తూ, శ్రీసిటీ సుస్థిర అభివృద్ధి ప్రణాళికలో విద్య ఒక కీలకమైన అంశమని పేర్కొన్నారు. అకార్డ్ స్కూల్‌కు కేంబ్రిడ్జ్ గుర్తింపు రావడం ద్వారా శ్రీసిటీలో ప్రపంచ స్థాయి విద్యా అవకాశాలు మరింత విస్తరిస్తాయని, భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దే దిశగా ఇది ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందని అన్నారు. ప్రశాంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అకార్డ్ స్కూల్ ఇప్పటికే సమగ్ర విద్యకు ప్రాధాన్యత ఇస్తుండగా, తాజా గుర్తింపుతో ప్రపంచవ్యాప్తంగా ఉన్న కేంబ్రిడ్జ్ విద్యాసంస్థల నెట్‌వర్క్‌లో చేరింది. అలాగే ఉపాధ్యాయులకు కేంబ్రిడ్జ్ శిక్షణా కార్యక్రమాలు అందుబాటులోకి రావడం ద్వారా బోధన నాణ్యత మరింత మెరుగుపడనుంది. ఈ పరిణామంతో పరిశ్రమల కేంద్రంగా పేరొందిన శ్రీసిటీ, ప్రపంచ స్థాయి విద్యా కేంద్రంగా కూడా తన గుర్తింపును మరింత బలోపేతం చేసుకుంది.

**స్కూల్ యాజమాన్యానికి మంత్రి అభినందనలు :** శ్రీసిటీ హెలిప్యాడ్ వద్ద రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ, ఎలక్ట్రానిక్స్ ఄ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేష్ ను కలిసిన అకార్డ్ స్కూల్ ప్రిన్సిపాల్ బృందా త్యాగరాజన్, కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ గుర్తింపును ఆయన దృష్టికి తెచ్చారు. స్కూల్ యాజమాన్యాన్ని అభినందించిన మంత్రి, ఈ గుర్తింపు ప్రాంత విద్యా అభివృద్ధికి ప్రధాన మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్, శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డితో పాటు ఇతర ప్రముఖులు హాజరయ్యారు

# నువ్వూరుపాడు గ్రామానికి త్రాగునీటి సమస్యకు శ్రీకారం



**ఆత్మకూరు జూలై 20 (వార్తాప్రభ ప్రతినిధి)** ఆత్మకూరు మండలంలోని నువ్వూరుపాడు గ్రామంలో ఎన్నో సంవత్సరాలు గా త్రాగునీటి సమస్య వెంటాడుతూ ఉంది ఎండాకాలం అయితే ఏప్రిల్ నెల నుంచి జులై నెల దాకా కూడా నీళ్ల ట్యాంకర్లతో నీరు తోలవలసి వచ్చేది ఈ సమస్యను శాశ్వత పరిష్కారం కోసం గ్రామ ప్రజలు కూటమి నాయకుల దృష్టికి తీసుకెళ్లగా కూటమి నాయకులు వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి త్రాగునీటి సమస్యను శాశ్వత పరిష్కార దిశగా ఈ రోజున బొగ్గెరులో గ్రామ పంచాయితీ 15వ ఆర్థిక సంఘం నిధులతో రెండు లక్షల రూపాయలు ఆర్థిక వ్యయంతో నూతన బోర్ పాయింట్ వేయటం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఈ భూమి పూజ కార్యక్రమంలో ఎంపీపీ కేత వేణుగోపాల్ రెడ్డి ఆర్ డబ్ల్యు ఎస్ ఏఈ బి.వి సుదర్శన్ బాబు పాత జంగాలపల్లి టిడిపి యువ నాయకుడు వీరపురెడ్డి సుదర్శన్ రెడ్డి టిడిపి గ్రామ కమిటీ కార్యదర్శి షేక్ ఖాజావలి టిడిపి ఉపాధ్యక్షులు పందిపాటి రామ్మోహన్ రెడ్డి మండల కమిటీ కార్యదర్శి దేవరపాటి శ్రీనివాసులు మరియు టిడిపి సీనియర్ నాయకులు మాజీ ప్రెసిడెంట్ దేవరపాటి రమణయ్య తదితర గ్రామపంచాయతీ నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయడం జరిగింది.

# ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉత్తమ సేవలకు సన్మానాలు



**మచిలీపట్నం జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని కృష్ణా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వారోత్సవాలు విజయవంతంగా ముగిశాయి. “పిల్లల మధ్య ఎడం పాటిద్దాం.. ఆరోగ్యవంతమైన, సంతోషకరమైన కుటుంబాన్ని నిర్మిద్దాం” అనే నినాదంతో ఈ నెల 11 నుంచి 18వ తేదీ వరకు జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ర్యాలీలు, సమావేశాలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.వారోత్సవాల ముగింపు సందర్భంగా పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో జరిగిన కార్యక్రమంలో వివిధ రంగాల్లో ఉత్తమ సేవలు అందించిన ఒక గైనకాలజిస్టు, ఒక వేసెక్టమీ శస్త్రచికిత్స నిపుణుడు, ఒక ఏఎన్ఎం, ఒక మధ్యస్థాయి ఆరోగ్య సేవల అధికారి (ఎంఎల్‌హెచ్‌పీ), ఒక ఆశా కార్యకర్తను ఎంపిక చేసి ప్రశంసాపత్రాలు, నగదు బహుమతులను సంయుక్త కలెక్టర్ మల్లవరపు నవీన్ అందజేశారు.అదేవిధంగా, ఇద్దరు లేదా ముగ్గురు పిల్లలతో కుటుంబ నియంత్రణను పాటిస్తున్న దంపతులను, పిల్లల మధ్య విరామం కోసం ఐయూడీ వేయించుకున్న మహిళలను, కుటుంబ నియంత్రణలో భాగంగా వేసెక్టమీ చేయించుకున్న పురుషులను కూడా సన్మానించి ప్రశంసాపత్రాలు, నగదు ప్రోత్సాహకాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. లోకానాథం దయాకర్, సంయుక్త కలెక్టర్ మల్లవరపు నవీన్, వివిధ శాఖల అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# టిడ్కో గృహాల నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో సమీక్షించిన ఎమ్మెల్యే



**జగ్గయ్యపేట జులై 20 (వార్తప్రభ)** పట్టణంలోని టిడ్కో గృహాల నిర్మాణ ప్రాంతాన్ని స్థానిక శాసనసభ్యులు, తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు శ్రీ శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) సోమవారం సందర్శించి, నిర్మాణ పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా సంబంధిత శాఖ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే టిడ్కో గృహాల నిర్మాణ పనుల ప్రస్తుత పరిస్థితిని సమీక్షించారు. పనులను మరింత వేగవంతంగా పూర్తి చేసి, లబ్ధిదారులకు ఇళ్లను త్వరితగతిన అందించేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా, నిర్ణయించిన గడువులో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.అలాగే టిడ్కో గృహాల నిర్మాణానికి సంబంధించిన సమస్యలు, పనుల పురోగతి, చేపట్టాల్సిన తదుపరి కార్యాచరణపై సమగ్రంగా చర్చించేందుకు ఈ నెల 24వ తేదీన జగ్గయ్యపేట మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్టర్లు, సంబంధిత శాఖ అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జగ్గయ్యపేట మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు వెంకటీ, పుల్లారావు, నాయకులు రఘు, శ్రీనాథ్, అక్బర్, సంబంధిత శాఖ అధికారులు మరియు స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు..

## ఐఐఐ సీటు సాధించి సత్తా చాటిన కొమ్మారెడ్డి విద్యా కుసుమాలు.......



**కృత్తివెన్ను జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొమ్మారెడ్డి స్కూల్ మరొమారు చదువు అంటే బట్టి పట్టడం కాదు అని విద్యార్థులకు అర్థం అయ్యే విధంగా వాళ్ళ జైత్ర యాత్ర కేవలం పది ఫలితాల్లోనే కాదు వాళ్ళ భవిష్యత్తులో ఎక్కడకు వెళ్లిన అక్కడ ఇమిడిపోయే విద్యను అందించడమే తమ లక్ష్యమని నిరూపించి సత్తా చాటింది. సోమవారం విడుదల అయిన ట్రిపుల్ ఐటీ సెలక్షన్ లిస్ట్ లో కొమ్మారెడ్డి విద్యార్థిని జే. నాగ కోమలి సెలక్ట్ అయ్యింది. ఈమెకు ఒంగోలు క్యాంపస్ ట్రిపుల్ ఐటీ లో సీటు వచ్చింది. 2026 విద్యా సంవత్సరంలో యిప్పటికే కొమ్మారెడ్డి పాఠశాల నుండి ఈ. దివిజ, ఎం ఎల్ ఎస్ ఎన్ స్వప్నికా ఒంగోలు క్యాంపస్ లో ట్రిపుల్ ఐటీ సాధించారు. యిప్పుడు నాగ కోమలి కూడా ఒంగోలు క్యాంపస్ ఐఐఐ టీ సీటు సాధించడంతో కొమ్మారెడ్డి స్కూల్ కొన్ని ప్రైవేట్ స్కూల్ లా మాదిరి బట్టి పట్టించడం కాదు విద్యార్థిని విద్యార్థులకు సంపూర్ణ విజ్ఞానం అందించడమే లక్ష్యంగా ముందుకు వెళు తున్నది అనే విషయం తేట తెల్లమైంది.

# చికెన వ్యర్థాల వాహనంపై కేసు నమోదు



**మర్రిపాడు జూలై 20 (వార్తాప్రభ)** చుంచులూరు క్రాస్ రోడ్ వద్ద సోమవారం 20.07.2026న ఉదయం 04.30 గంటలకు మర్రిపాడు పోలీస్ స్టేషన్ యస్.ఐ బలరామిరెడ్డికి రాబడిన సమాచారం మేరకు మైదుకూరు నుండి చికెన్ వ్యర్థాలను అనుమతి లేకుండా తరలిస్తూ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారువాటిని చేపలకు పందులకు ఆహారముగా వేస్తూ ప్రజల ఆరోగ్యంనకు హాని కలిగిస్తూ ప్రయాణికులకు వాహన దారులకు ఇబ్బంది కలిగిస్తూ వున్నారన్న సమాచారం యస్.ఐ పై అధికారుల ఉత్తర్వుల మేరకు తన సిబ్బంది చుంచులూరు క్రాస్ రోడ్డు వద్ద వాహనాలు తనిఖీ చేస్తూ ఉండగా బద్వేల్ నుండి మర్రిపాడు వైపు వస్తున్న AP39 VD 4703 నెంబర్ గల బోలెరో వాహనంను తనికీ చేయగా అందులో ఎలాంటి అనుమతి లేకుండా ఆక్రమముగా తరలిస్తూ వున్న సుమారు 12 డ్రమ్ముల చికెన్ వ్యర్థాలను స్వాదీన పరుచుకున్నారు.సదరు వాహన యజమాని అందుబాటులో లేనందున వాహన డ్రైవరు ను అదుపులోనికీ తీసుకొని కేసు నమోదు చేసి సదరు చికెన్ వ్యర్థాలను రెవెన్యూవారి సమక్షములో ఊరి బయట పూడ్చి వేయడమైనది.

# సూరారం పోలీస్ స్టేషన్ నూతన సీఐ బాలరాజుకు ఘన సత్కారం

**మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు, బీజేపీ నేతలు**

**శాంతిభద్రతల పరిరక్షణలో బాలరాజు సేవలు అభినందనీయం :: రావుల శేషగిరిరావు, నల్ల జై శంకర్ గౌడ్"**



**సూరారం, జూలై 20, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సూరారం పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ)గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కే. బాలరాజుకు ఘన సన్మానం జరిగింది. బుధవారం నాడు పలువురు రాజకీయ, సామాజిక రంగాల ప్రముఖులు పోలీస్ స్టేషన్‌లో సీఐ బాలరాజును మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గాజులరామారం మాజీ కార్పొరేటర్ రావుల శేషగిరిరావు, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి నల్ల జై శంకర్ గౌడ్, మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పులి బలరాం పాల్గొని మాట్లాడారు. కే. బాలరాజు గతంలో జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో సీఐగా విధులు నిర్వహించిన కాలంలో ప్రజాదరణ పొందిన అధికారిగా గుర్తింపు తెచ్చుకున్నారని కొనియాడారు. ముఖ్యంగా కరోనా మహమ్మారి విజృంభించిన క్లిష్ట పరిస్థితుల్లో విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి ప్రజలకు ఎంతో అండగా నిలిచారని, శాంతిభద్రతలను సమర్థవంతంగా పరిరక్షించారని గుర్తు చేశారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల, ప్రజల సమస్యలను ఎంతో ఓర్పుతో విని, నిష్పాక్షికంగా న్యాయం చేసే అధికారిగా ఆయనకు మంచి పేరు ఉందని పేర్కొన్నారు. బాలరాజు మళ్లీ సూరారం పోలీస్ స్టేషన్ పరిధికి సీఐగా బాధ్యతలు చేపట్టడం స్థానిక ప్రజలకు ఎంతో ఆనందదాయకమని నాయకులు అభిప్రాయపడ్డారు. ఆయన సమర్థవంతమైన నాయకత్వంలో సూరారం ప్రాంతంలో శాంతిభద్రతలు మరింత బలోపేతం అవుతాయని, నేరాలు అదుపులోకి రావడంతో పాటు ప్రజలకు సత్వర న్యాయం, మెరుగైన పోలీసు సేవలు అందుతాయనే పూర్తి విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ప్రజలకు ఇదే సేవాభావంతో నిరంతరం న్యాయం చేయాలని ఆకాంక్షించారు. ఈ సత్కార కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు శ్రీరాములు, మాధవులతో పాటు పలువురు కాలనీల ప్రతినిధులు, బస్తీ పెద్దలు పాల్గొన్నారు.

# గ్రీన్ డేలో మొక్కల సందడి!!

**చిన్నారులతో హరితోత్సవం**

**దీప్తి కిడ్స్‌లో గ్రీన్ డే**

**ఎన్టీపీసీ హరిత కార్యక్రమం**

**పచ్చదనానికి చిన్నారుల ప్రతిజ్ఞ**







**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 20 (వార్తాప్రభ):** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని చిన్నారుల మనసుల్లో నాటే లక్ష్యంతో ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ ఆధ్వర్యంలో సోమవారం గ్రీన్ డేను పురస్కరించుకుని దీప్తి కిడ్స్ కార్నర్‌లో ఘనంగా మొక్కల నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దీప్తి మహిళా సమితి (డీఎంఎస్) అధ్యక్షురాలు రాఖీ సమంత హాజరై మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమెతో పాటు దీప్తి మహిళా సమితి సీనియర్ సభ్యులు పాల్గొని చిన్నారులను ప్రోత్సహించారు. ఈ సందర్భంగా దీప్తి కిడ్స్ కార్నర్‌కు చెందిన చిన్నారులు ఉత్సాహంగా మొక్కలు నాటి ప్రకృతిని కాపాడాలని ప్రతిజ్ఞ చేశారు. ప్రతి మొక్క భవిష్యత్ తరాలకు జీవనాధారమని, పచ్చదనాన్ని పెంపొందించడం ద్వారా స్వచ్ఛమైన వాతావరణాన్ని నిర్మించవచ్చని నిర్వాహకులు వివరించారు. చిన్నప్పటి నుంచే ప్రకృతి పట్ల ప్రేమ, పర్యావరణ పరిరక్షణపై బాధ్యత, స్థిరమైన జీవన విధానంపై అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించే బాధ్యత కూడా ప్రతి ఒక్కరూ తీసుకోవాలని చిన్నారులకు సూచించారు. ప్రకృతిని ప్రేమించే అలవాటు పెంపొందితే భవిష్యత్తులో పర్యావరణ పరిరక్షణలో వారు కీలక పాత్ర పోషిస్తారని పేర్కొన్నారు. ఎన్టీపీసీ రామగుండం, తెలంగాణ సంస్థ సామాజిక బాధ్యతలో భాగంగా పర్యావరణ హిత కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ సమాజంలో హరిత చైతన్యాన్ని విస్తరించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. గ్రీన్ డే వేడుకల ద్వారా చిన్నారులను భవిష్యత్ హరిత రాయబారులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేయడం అభినందనీయమని పాల్గొన్నవారు పేర్కొన్నారు. కార్యక్రమం మొత్తం పచ్చదనం, ప్రకృతి ప్రేమ, పర్యావరణ బాధ్యత అనే సందేశాలతో స్ఫూర్తిదాయకంగా సాగింది.

# ఎస్.ఐ.ఆర్. కార్యక్రమంలో అర్హత కలిగిన ప్రతి ఓటర్ తప్పనిసరిగా పాల్గొనండి

**-మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్.**



**శేరిలింగంపల్లి,జూలై 20 (వార్తాప్రభ):** భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా పాల్గొనాలని కొండాపూర్ మాజీ కార్పొరేటర్ షేక్ హమీద్ పటేల్ పిలుపునిచ్చారు.సోమవారం ఎన్యుమరేషన్ కేంద్రాలను పరిశీలించిన ఆయన,బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలు సేకరిస్తున్న తీరును సమీక్షించారు.గడువులోగా వంద శాతం ఎన్యుమరేషన్ పూర్తి చేయాలని,సేకరించిన దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు.ప్రజలు బీఎల్ఓలకు అవసరమైన వివరాలు,పత్రాలు అందించి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమానికి సహకరించాలని హమీద్ పటేల్ కోరారు.

# గెస్ట్ లెక్చరర్ల నియామకం ఆహ్వానం!!

- పీజీ అర్హతతో లెక్చరర్ ఉద్యోగాలకు అవకాశం
- నిరుద్యోగ యువతకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల గుడ్ న్యూస్
- జూలై 23న గెస్ట్ లెక్చరర్ల ఇంటర్వ్యూలు
- ప్రిన్సిపాల్ జై కిషన్

**పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూలై 20 (వార్తాప్రభ):** గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకుల నియామక ప్రక్రియ ప్రారంభమైంది. ఈ మేరకు కళాశాల ప్రిన్సిపల్ జై కిషన్ ఓరూ ప్రకటన విడుదల చేశారు. కామర్స్‌లో రెండు, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్, పొలిటికల్ సైన్స్, హెల్త్ కేర్/మైక్రోబయాలజీలో ఒక్కో పోస్టు, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్‌లో రెండు, తెలుగులో రెండు పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానించారు. సంబంధిత సబ్జెక్టులో జనరల్ అభ్యర్థులు కనీసం 55 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులతో పీజీ పూర్తి చేసి ఉండాలని తెలిపారు. నెట్, స్లెట్, సెట్ లేదా పీహెచ్‌డీ అర్హత ఉన్న వారికి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు. జూలై 21, 22 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4:30 గంటల వరకు దరఖాస్తులను విద్యార్హతలు, కుల ధ్రువీకరణ, ఆధార్, అనుభవ ధ్రువపత్రాల నకళ్లతో కళాశాలలో సమర్పించాలని సూచించారు. జూలై 22 సాయంత్రం 4:30 గంటల తర్వాత వచ్చే దరఖాస్తులు స్వీకరించబోమని స్పష్టం చేశారు. ముందుగా దరఖాస్తు చేసిన అభ్యర్థులు జూలై 23న ఉదయం 10 గంటలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పెద్దపల్లిలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని, అదే




రోజు సర్టిఫికెట్ల పరిశీలనతో పాటు డెమో, ఇంటర్వ్యూ నిర్వహించి తుది ఎంపిక చేపడతామని వెల్లడించారు. అర్హతలు కలిగిన నిరుద్యోగ యువతీ, యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రిన్సిపల్ కోరారు.

# ఇంజక్షన్ ఉత్తర్వులు ఉన్నా కాంపౌండ్ వాల్ నిర్మాణం

**జీహెచ్ఎంసీ, పోలీసులకు ఫిర్యాదు**





**హైదరాబాద్ :జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సంగారెడ్డి జిల్లా పటాన్చెరువు మండలం ముత్తంగిలో సివిల్ వివాదంలో ఉన్న భూమిలో, కోర్టు మధ్యంతర ఇంజంక్షన్ ఉత్తర్వులు అమల్లో ఉన్నప్పటికీ కాంపౌండ్ వాల్ నిర్మాణం చేపడుతున్నారని ఆరోపిస్తూ వాది పల్లపోతు సుబ్రమణ్యేశ్వర్ జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాన్ని వెంటనే నిలిపివేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.సుబ్రమణ్యేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం, O.S. No.187/2026లో I.A. No.466/2026పై సంగారెడ్డి అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు 24-06-2026న మధ్యంతర ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఆ ఉత్తర్వులు ప్రస్తుతం అమల్లో ఉన్నప్పటికీ, సంబంధిత వ్యక్తులు ఎలాంటి చట్టబద్ధమైన భవన లేదా కాంపౌండ్ వాల్ నిర్మాణ అనుమతులు లేకుండానే పనులు కొనసాగిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు జీహెచ్ఎంసీ తెల్లాపూర్ సర్కిల్ జోనల్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్‌తో పాటు పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సంబంధిత భూమి వాస్తవానికి పట్టాదారు మల్లయ్యకు చెందినదని, అనంతరం ఆయన వారసుల నుంచి తమ కుటుంబం రిజిస్టర్డ్ అమ్మకపు దస్తావేజు ద్వారా కొనుగోలు చేసిందని సుబ్రమణ్యేశ్వర్ పేర్కొన్నారు. అయితే, మల్లయ్య జీవించి ఉన్న సమయంలోనే చెల్లని పత్రాలు, ఫోర్జరీ సంతకాలను ఆధారంగా చేసుకుని నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తమ భూమిపై హక్కులు చూపే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఈ అంశంపై సివిల్ కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండగా, తమ స్వాధీనాన్ని పరిరక్షిస్తూ కోర్టు మధ్యంతర ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు. అదేవిధంగా, జీపీఆర్ లేఅవుట్‌కు చెందిన ప్రసాద్ రెడ్డి ఈ మొత్తం వ్యవహారానికి ప్రధాన కారణమని సుబ్రమణ్యేశ్వర్ ఆరోపించారు. తమ వ్యవసాయ భూమిని కబ్జా చేయాలనే ఉద్దేశంతో, దానిని తన లేఅవుట్‌లోని ప్లాట్లలో భాగంగా చిత్రీకరిస్తూ ముందస్తు ప్రణాళికతో ఈ చర్యలకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. కోర్టు వివాదంలో ఉన్న భూమిని లేఅవుట్‌లో భాగంగా చూపిస్తూ తమ యాజమాన్య హక్కులను దెబ్బతీయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కోర్టు ఉత్తర్వులను పట్టించుకోకుండా నిర్మాణం కొనసాగించడం వల్ల వివాదం మరింత తీవ్రమై శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జీహెచ్ఎంసీ అధికారులు నిర్మాణ అనుమతులను పరిశీలించి, అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే వెంటనే పనులను నిలిపివేయాలని, అలాగే శాంతిభద్రతల పరిరక్షణ దృష్ట్యా పోలీసులు చట్టప్రకారం తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. న్యాయస్థానం ఉత్తర్వులకు అనుగుణంగా సంబంధిత అధికారులు తక్షణ చర్యలు తీసుకుని అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని కోరారు.

# మార్కెట్ యార్డ్ పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి

- పారిశుధ్య పనులను స్వయంగా పర్యవేక్షించిన ఏఎంసీ చైర్మన్, లాల్ సింగ్ నాయక్
- వ్యాపారులు, రైతులకు పరిశుభ్రమైన వాతావరణమే లక్ష్యం




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కొత్తగూడెం, జూలై 20 ( ) రైతులు, వ్యాపారులు నిత్యం రాకపోకలు సాగించే మార్కెట్ యార్డును, మార్కెట్ యార్డ్ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేందుకు వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఏఎంసీ) చైర్మన్ లాల్ సింగ్ నాయక్ ప్రత్యేక దృష్టి సారించారు. చిన్న చినుకు పడిన ఎగువ నుండి వచ్చే వరద నీటి ప్రవాహంతో మార్కెట్ యార్డ్ షాపింగ్ కాంప్లెక్స్ ప్రాంతమంత చిన్నపాటి పిల్ల కాలువలా మారి వాహనదారుల రాకపోకలకు అంతరాయం ఏర్పడటమే కాక, మార్కెట్ యార్డులోని దుకాణాలకు వెళ్లేందుకు దారి కూడా లేకుండా పోతుంది. ఈ నేపథ్యంలో చైర్మన్ లాల్ సింగ్ నాయక్ డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తను వెంటనే దగ్గరుండి తొలగించడంతో పాటు డ్రైనేజీల శుభ్రపరచడం, పిచ్చి మొక్కల తొలగింపు, చెత్త సేకరణ వంటి పనులను వేగవంతం చేయాలని సంజయ్ నగర్ సర్పంచ్ తాటి బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు దృష్టికి తీసుకెళ్లారు. కాగా సోమవారం మార్కెట్ యార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను స్వయంగా పరిశీలించి, ఎక్కడా చెత్త పేరుకుపోకుండా ప్రతిరోజూ శుభ్రత చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమలు, ఈగలు పెరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, డ్రైనేజీల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని మార్కెట్ యార్డ్ సిబ్బందిని ఆదేశించారు. రైతులు తమ పంటలను విక్రయించేందుకు వచ్చే సమయంలో ఎలాంటి అసౌకర్యం కలగకుండా పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించడం తమ ప్రధాన బాధ్యత అని చైర్మన్ పేర్కొన్నారు. మార్కెట్ యార్డు పరిశుభ్రంగా ఉంటే రైతులతో పాటు వ్యాపారులకు కూడా అనుకూల వాతావరణం ఏర్పడుతుందని అన్నారు. పరిశుభ్రమైన మార్కెట్ యార్డు ద్వారా మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఏఎంసీ చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కార్యదర్శి, ఏఎంసీ సిబ్బంది, పంచాయతీ పారిశుధ్య కార్మికులు, పాల్గొన్నారు.

# ప్రభుత్వం జీవో నెం. 396ను వెంటనే రద్దు చేయాలి

**దస్తావేజు లేఖర్లపై ఆంక్షలు ఎత్తివేయాలి-తన్నీరు నాగేశ్వరరావు**



**జగ్గయ్యపేట జూలై 20 (వార్తప్రభ)** రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 396ను వెంటనే రద్దు చేసి, దస్తావేజు లేఖర్లపై విధించిన ఆంక్షలు, నిషేధాలను ఎత్తివేయాలని జగ్గయ్యపేట నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.సోమవారం జగ్గయ్యపేట పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదుట దస్తావేజు లేఖర్లు నిర్వహించిన శాంతియుత ధర్నాకు ఆయన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున మద్దతు ప్రకటించారు. అనంతరం సబ్ రిజిస్ట్రార్‌ను కలిసి దస్తావేజు లేఖర్లు పడే ఇబ్బందులను వివరించారు.ఈ సందర్భంగా తన్నీరు నాగేశ్వరరావు మాట్లాడుతూ, గత నెల 30వ తేదీన ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం. 396 వల్ల రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది దస్తావేజు లేఖర్ల జీవనోపాధి ప్రమాదంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ జీవో అమలుతో దస్తావేజు లేఖర్ల వృత్తి దెబ్బతినడమే కాకుండా, ప్రజల ఆస్తుల భద్రత, న్యాయపరమైన రక్షణ కూడా దెబ్బతినే అవకాశం ఉందన్నారు.ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ నిర్ణయం వల్ల అనేక కుటుంబాలు ఉపాధి కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని, దస్తావేజు లేఖర్లను ఇబ్బందులకు గురిచేసే చర్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా దస్తావేజు లేఖర్లతో కలిసి ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.దస్తావేజు లేఖర్ల సమస్యలను ప్రభుత్వం మానవతా దృక్పథంతో పరిశీలించి, జీవో నెం. 396ను వెంటనే రద్దు చేసి వారి జీవనోపాధిని కాపాడాలని తన్నీరు నాగేశ్వరరావు ప్రభుత్వాన్ని కోరారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు పఠాన్ ఫిరోజ్ ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మన్ హఫీజున్నిసా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గింజుపల్లి శ్రీనివాసరావు, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కన్నమాల శ్యామల్, జిల్లా పంచాయతీ రాజ్ కార్యదర్శి శీలం మంగారావు, మండల ప్రచార విభాగ అధ్యక్షులు వేశాల కనక చంద్రరావు, పట్టణ ప్రధాన కార్యదర్శి పింగళి నరసింహారెడ్డి, పట్టణ కార్యదర్శి దార్ల ప్రసన్నకుమార్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు పిడమర్తి ప్రభు, పట్టణ ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు ఉసా సురేష్, దస్తావేజు లేఖర్ల సంఘం నాయకులు, సభ్యులు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాఠకుల్లో విజ్ఞానం పెంపొందించాలి

**"నవ మల్లెతీగ" మంత్లీ మ్యాగజైన్ ఆవిష్కరించిన ఎమ్మెల్సీ మల్క కొమరయ్య**



**హైదరాబాద్ :జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పాఠకుల్లో మరింత విజ్ఞానం పెంపొందించేలా నవ మల్లెతీగ సకుటుంబ సాహిత్య మాస పత్రిక నిర్వాహకులు కృషి చేయాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య కోరారు. జులై నెలకు సంబంధించిన మంత్లీ మ్యాగజైన్ ను సోమవారం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ నాచారంలో బీజేపీ రాష్ట్ర నాయకులు వాసంశెట్టి శ్రీనివాస్, నవ మల్లెతీగ సకుటుంబ సాహిత్య మాస పత్రిక తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి, సీనియర్ జర్నలిస్ట్ ఇస్కా రాజేష్ బాబు తో కలిసి ఉపాధ్యాయ ఎంఎల్ సీ మల్క కొమరయ్య ఆవిష్కరించారు. ఈ మాస పత్రిక ముమ్ముందు మరింత ప్రజాదరణ పొందాలని ఎమ్మెల్సీ మల్క కొమరయ్య మనస్ఫూర్తిగా కోరుకున్నారు.నవ మల్లెతీగ సకుటుంబ సాహిత్య మాస పత్రిక తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి, సీనియర్ జర్నలిస్ట్ ఇస్కా రాజేష్ బాబు కు ప్రత్యేకంగా మల్క కొమరయ్య అభినందనలు తెలిపారు.

# ఒక గంట 15 నిమిషాల్లో 50 చిత్రాలు.

**విశ్వగురు వరల్డ్ రికార్డు' సాధించిన బాలుడు వేదార్థ్**






**కూకట్ పల్లి, జూలై 20(వార్తాప్రభ):** చిత్రలేఖనంలో ఐదున్నరేళ్ల మాస్టర్ వేదార్త్ అరుదైన ఘనత సాధించాడు. కేవలం గంటా 15 నిమిషాల్లో ఏనుగు" థీమ్‌పై 50 చిత్రాలు గీసి విశ్వగురు వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించాడు. నిజాంపేట్‌కు చెందిన డాక్టర్ ఉప్పల మణికంఠ, డాక్టర్ శ్రీలత దంపతుల కుమారుడైన వేదార్త్ నిజాంపేట్‌లోని కేపీఆర్ దివ్య ప్రభాస్ ఎన్‌క్లేవ్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తన అసాధారణ ప్రతిభను ప్రదర్శించాడు. సద్గురు ది స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ విద్యార్థి అయిన వేదార్త్ ప్రత్యక్షంగా 50 విభిన్న ఏనుగు చిత్రాలను గీసి ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు.వేదార్త్ ప్రతిభను పరిశీలించిన విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ప్రతినిధులు, ఈ ఘనతను అధికారికంగా విశ్వగురు వరల్డ్ రికార్డు గా నమోదు చేస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి లక్ష్మీకాంతం మాట్లాడుతూ,వేదార్త్ గీసిన ప్రతి చిత్రంలో భావవ్యక్తీకరణ అద్భుతంగా ఉందని ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ వ్యవస్థాపకుడు, సీఈఓ డాక్టర్ సత్యవోలు రాంబాబు, డాక్టర్ సారంగపాణి, ప్రముఖ చిత్రకారుడు సురేష్, ప్రముఖ వాస్తు నిపుణుడు, ఈనాడు కాలమిస్ట్ కృష్ణాది శేషు, హైకోర్టు న్యాయవాది సీహెచ్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. వేదికపై వేదార్త్ ఏకాగ్రతతో వరుసగా 50 చిత్రాలను గీయడం అతిథులు, కళాభిమానులను విశేషంగా ఆకట్టుకుంది. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ కనబరిచిన వేదార్త్‌ను అతిథులు అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

# మెరుగైన వైద్యం కోసం ఎల్ ఓ సీ అందజేత




**విజయవాడ పశ్చిమ జులై 20 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఎమ్మెల్యే సుజనా చౌదరి చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఎల్ ఓ సీ (లెటర్ ఆఫ్ క్రెడిట్) ను ఎన్డీయే కార్యాలయంలో కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ కూటమి నేతలతో కలిసి అందజేశారు .48 వ డివిజన్, చిట్టినగర్ కు చెందిన సీ హెచ్ సాయిబాబు (32) మూత్రపిండాల సమస్యతో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు..అతడికి మరింత మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు తెలపడంతో వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ 2 లక్షల 52 వేల ఎల్ ఓ సీ ను బాధితుడి తండ్రికి అందజేశారు.త్వరితగతిన స్పందించి ఎల్ ఓ సీ ను అందజేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరి కు బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.కూటమి నేతలు బుల్లా విజయ్, గుండారపు హరి బాబు, కామ దేవరాజ్, పిళ్ళ శ్రీనివాస్, గుజ్జారి అమర్ బాబు, పోతిన భేసు కంటేశ్వరుడు,పాల మాధవ్ , ఆకారపు విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు..

## పదవీ విరమణ సభలో గద్వాల సోమన్న







**గన్నవరం, జూలై 20 (వార్తాప్రభ) :** నందవరం మండల పరిధిలోని జడ్పీహెచ్ స్కూల్ నాగలదిన్నెలో గణితోపాధ్యాయుడుగా పనిచేస్తున్న బాలబంధు గద్వాల సోమన్న వారి ప్రధానోపాధ్యాయులు అద్దేపల్లి జాన్సన్ పదవీ విరమణ సందర్భంగా వారిపై చక్కని గేయం వ్రాసి వేదికపై చదివి అందరినీ అలరించారు. చూడ చక్కని మెమెంటో అందించారు. వీరి హయాంలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కలెక్టర్ వీరపాండ్యన్ , ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి ఉగాది పురస్కారం అందుకోవడం విశేషం."బాల గేయ బ్రహ్మ" గద్వాల సోమన్న మాట్లాడుతూ "పదవీ విరమణ "ప్రతి ఉద్యోగికి సర్వ సాధారణమని నొక్కి వక్కాణిస్తూ, ఉపాధ్యాయ వృత్తి సమాజంలో పవిత్రమైనదని, కన్పించే వేల్పులు ఉపాధ్యాయులు అని ఉద్వేగభరితంగా సందేశమిచ్చారు. సాహితీ సృజనలో బాలసాహిత్యవేత్తగా అటు వృత్తిలోనూ, ఇటు ప్రవృత్తిలో శతాధిక గ్రంథకర్త కావడం వారి అవిరళ కృషికి లభించిన అరుదైన గౌరవం. అద్భుతమైన గేయం వ్రాసి, బహు కావ్యకర్తగా నిలిచిన సోమన్నను తోటి ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు అభినందించారు. ఈ కార్యక్రమంలో నాగలదిన్నె ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులంతా పాల్గొన్నారు.

## ముద్రగడకు వైసీపీ నేతల ఘన నివాళి

● ముద్రగడ నివాసానికి చేరుకున్న వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి





**కిర్లంపూడి, జూలై 20 (వార్తాప్రభ) :** మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత స్వర్గీయ ముద్రగడ పద్మనాభం నివాసానికి వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి చేరుకుని ఘన నివాళులర్పించారు. ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు తోట నరసింహం, కురసాల కన్నబాబు, అంబటి రాంబాబు, జోగి రమేష్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, సాకే శైలజానాథ్, మాజీ ఎంపీలు వంగా గీతా విశ్వనాథ్, మార్గాని భరత్, మాజీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి, జక్కంపూడి రాజా, నాయకులు వంగవీటి నరేంద్ర, తోట రాంజీ, తోట రామకృష్ణ, సత్తి సూర్యనారాయణరెడ్డి, ఒమ్మి రఘురామ్, కర్రి పాపారాయుడు తదితరులు పాల్గొని ముద్రగడకు ఘన నివాళులర్పించారు.

## శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి పుట్టింటి సారె సమర్పణ...



**పెనుగంచిప్రోలు, జూలై 20 (వార్తాప్రభ) :** ఆషాడమాసం సందర్భంగా పెనుగంచిప్రోలు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి మరియు పరివార దేవత మూర్తులకు డిప్యూటీ కమిషనర్ జీ వీ డి ఎన్ లీలా కుమార్ ఆదేశాన సారం సోమవారం అమ్మవారి పుట్టిన ఊరు అనిగండ్లపాడు గ్రామం నుంచి మహిళలు సారె సమర్పించి బోనాలు చెల్లించారు, వీరికి ఆలయం వద్ద ఆలయ అధికారులు స్వాగతం పలికి సారెను అమ్మవారికి అందజేశారు, అనంతరం సారె తీసుకు వచ్చిన వారికి వేద పండితుల అశీర్వచనం అనంతరం ఆలయం వారు అన్న ప్రసాదం అందజేశారు, ఈకార్యక్రమంలో ఆలయ ఏఈవో జంగం శ్రీనివాసరావు, సూపరిన్టెంట్ రాజు, టెంపుల్ ఇన్స్పెక్టర్ బద్దుల కృష్ణమోహన్, మాజీ ఉత్సవ కమిటీ చైర్మన్ చుంచు రమేష్ బాబు మరియు గ్రామపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

## తిరుమలకు భారీగా భక్తుల రాక... 31 కంపార్ట్‌మెంట్లు ఫుల్

**తిరుమల, జూలై 20 (వార్తాప్రభ) :** తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు పోటెత్తుతున్నారు. గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న రద్దీ సోమవారం కూడా తీవ్రస్థాయిలో ఉంది. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని మొత్తం 31 కంపార్ట్‌మెంట్లు భక్తులతో పూర్తిగా నిండిపోయాయి. ప్రస్తుతం టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులు స్వామివారిని దర్శించుకోవడానికి సుమారు 18 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. నిన్న ఆదివారం (జులై 19) ఒక్కరోజే 90,956 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారికి 33,046 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 4.05 కోట్లుగా నమోదైంది. రద్దీకి అనుగుణంగా టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది.

## స్మశాన వాటిక భూమి ఆక్రమణపై ఆర్డీవో కు వినతి

● హద్దులు నిర్ణయించి భూమి అప్పగించాలని మైనార్టీల డిమాండ్ ● భూ సర్వేకు తాసిల్దార్ కు ఆదేశాలు జారీ చేసిన ఆర్డిఓ



**నందిగామ, జూలై 20 (వార్తాప్రభ) :** మండల పరిధిలోని రుద్రవరం గ్రామపంచాయతీ రుద్రవరం, సోమవారం, గొల్లమూడి గ్రామాల ముస్లిం మైనార్టీలు తమ స్మశాన వాటిక భూమిపై జరిగిన అక్రమ ఆక్రమణను తొలగించాలని ఆర్డిఓ అనిల్ కుమార్ కు సోమవారం ప్రజా పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. రుద్రవరం జుమ్మా మసీద్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు షేక్ షాబ్జాన్, షేక్. ఖాజా బాబా లు మాట్లాడుతూ సుమారు 300 సంవత్సరాల క్రితం అప్పటి ప్రభుత్వం సర్వే నెం. 156లో సుమారు రెండు ఎకరాల భూమిని ముస్లిం మైనార్టీల స్మశాన వాటికగా కేటాయించిందని తెలిపారు. అప్పటి నుంచి మూడు గ్రామాలకు చెందిన ముస్లిం మైనార్టీలు అదే స్థలంలో అంత్యక్రియలు నిర్వహిస్తూ వస్తున్నారని తెలిపారు. అయితే ప్రస్తుతం రుద్రవరం గ్రామ శివారుకు చెందిన భూ యజమాని నాదెండ్ల సుమన్ స్మశాన వాటిక భూమిలో కొంత భాగాన్ని ఆక్రమించి స్మశాన ప్రాంతాన్ని ధ్వంసం చేశారని కమిటీ సభ్యులు ఆరోపించారు. దీనివలన భవిష్యత్తులో అంత్యక్రియలు నిర్వహించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే పరిస్థితి ఏర్పడిందని ఆయా గ్రామాల ముస్లిం సోదరులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో నందిగామ ఆర్‌డీఓ వెంటనే స్పందించి సంబంధిత భూమిపై సర్వే నిర్వహించి, స్మశాన వాటిక అసలు హద్దులను గుర్తించి, అక్రమ ఆక్రమణలను తొలగించి, భూమిని ముస్లిం మైనార్టీలకు అప్పగించడంతో పాటు శాశ్వత రక్షణ చర్యలు చేపట్టాలని వారు వినతి పత్రం లో ఆర్డీవోను కోరారు... దీనిపై ఆర్డిఓ అనిల్ కుమార్ తాసిల్దార్ సురేష్ బాబుకు.. రుద్రవరం గ్రామంలో ఆక్రమణకు గురైన స్మశాన వాటిక భూమిని యుద్ధప్రాతిపదికన అది కొలవటమా సర్వే చేసి హద్దులు నిర్ణయించి స్మశాన వాటిక ఆక్రమణకు గురికాకుండా ప్రభుత్వ నిధులు ద్వారా ప్రహరీ గోడ ఏర్పాటు చేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ ఆదేశించినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆక్రమణ గురైన స్మశాన వాటికి భూమిని వెంటనే హద్దులు నిర్ణయించాలని సున్నితమైన అంశాన్ని జాప్యం జరగరాదని భవిష్యత్తులో అక్కడ మత విద్వేషాలు రగలకుండగా మైనార్టీలకు తగు న్యాయం జరిగేలా చూడాలని తాసిల్దారును ఆర్డిఓ ఆదేశించినట్లు సమాచారం.

## గిరిజనుల సమస్యలు సకాలంలో పరిష్కరిస్తా

● రాష్ట్ర ఎస్.టి. కమిషన్ చైర్మన్ బొజ్జి రెడ్డి ● కూటమిలో నేను చేసిన తప్పు నిరూపించండి ● చిలుకూరి రామ్ కుమార్



**రౌతులపూడి, జూలై 20 (వార్తాప్రభ) :** రౌతలపూడి మండలంలోని జల్దాం గ్రామంలో ఏర్పాటు చేసిన గిరిజన ప్రజా సమస్యల సభలో సోల్ల బొజ్జి రెడ్డి ముఖ్య అతిథిగా వహించారు. సభ నిర్వహణకు కొన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ, గిరిజనులు భారీ సంఖ్యలో హాజరై ఛైర్మన్ కి ఘన స్వాగతం పలికారు. సభ ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయగా ఈ కార్యక్రమానికి బిజెపి సీనియర్ నాయకులు చిలుకూరి రామకుమారిని రౌతులపూడిలోనే పోలీసులు అడ్డుకున్నారు. ఏతప్పు లేకుండా తప్పు చేసిన వారిని శిక్షించకుండా ప్రజా సమస్యల కోసం పాటుపడే వారిని ఎందుకు అడ్డుకున్నారు. పోలీసులు సమాధానం చెప్పాలని రామ్ కుమార్ ప్రశ్నించారు. పోలీసులు వారి నుంచి సమాధానం రాకపోవడంతో నేను పోలీస్ స్టేషన్ లోనే కూర్చుంటానని అక్కడే ఉండిపోయారు. ఈ సందర్భంగా జల్దాం గ్రామంలోని ఛైర్మన్ ఆయా గిరిజన గ్రామాల నుంచి వచ్చిన గిరిజన ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రౌతలపూడి మండలంలోని అనేక గిరిజన గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయిందని గ్రామస్తులు చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. గ్రామాలకు సరైన రహదారులు లేవని, తాగునీటి సౌకర్యం లేదని, పక్కా గృహాలు మంజూరు కాలేదని, భూముల సర్వేలు జరగలేదని వారు వివరించారు. జల్దాం గ్రామ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న మైనింగ్ కార్యకలాపాల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. ప్రతిరోజూ సుమారు 500 మైనింగ్ క్వారీ లారీలు రాకపోకలు సాగించడం వల్ల ప్రజలు బయటకు వెళ్లేందుకు కూడా భయపడుతున్నారని గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, గుంతలు ఏర్పడి రాకపోకలు కష్టంగా మారాయని, ఇళ్లలోకి అధికంగా దుమ్ము చేరి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, మైనింగ్ కారణంగా కాలుష్యం పెరుగుతోందని తెలిపారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ మైనింగ్ వల్ల కలుగుతున్న ఇబ్బందులను నివారించాలని చైర్మన్ ని కోరారు. అదేవిధంగా, అనేక మంది గిరిజనులకు ఇప్పటికీ కుల ధ్రువీకరణ పత్రాలు అందలేదని, దీనివల్ల ఉన్నత విద్యను కొనసాగించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు లేకపోవడం వల్ల వైద్య సేవలు అందడం లేదని తెలిపారు. అలాగే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు కూడా లేకపోవడంతో చిన్నారుల విద్య దెబ్బతింటోందని పేర్కొన్నారు. పెద్దమలాపురాన్ని మండల కేంద్రంగా ప్రకటించి మినీ ఐటిడిఏ ఏర్పాటు చేయాలని గిరిజనులు విజ్ఞప్తి చేశారు. రంపచోడవరం, కాకినాడ ప్రాంతాలు దూరంగా ఉండటం వల్ల పరిపాలనా సేవలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అదేవిధంగా గిరిజన ఆదివాసీ భవనం నిర్మించాలని, పెద్దూరు నుంచి గిన్నెరం గ్రామం వరకు సరైన రహదారి నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో శివరామకృష్ణ , తహశీల్దారు సుధారాణి ,డిటి నరేష్ ఆధ్వర్యంలో గిరిజనుల సమస్యలను పూర్తిగా విన్న అనంతరం చైర్మన్ ఎస్.బొజ్జి రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సభ ముగిసిన అనంతరం ఛైర్మన్ తిరిగి రౌతులపూడి పోలీసు స్టేషన్ వద్ద ఆదివాసులతో కూర్చున్న రామ్ కుమార్ ని విషయాలు అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా రామ్ కుమార్ మాట్లాడుతూ సామాన్యమైన నన్ను ఈ కూటమిలో భాగస్వామ్యగా ఉన్న నాకు ఎప్పటి నుంచో ప్రజా సమస్యల మీద పోరాడినా స్వతహాగా పోరాటంతో ముందుకు వచ్చానని ఎప్పటినుంచో అనేక సార్లు అనేక ఒడిదుడుకులు ఎదుర్కొని ఆర్ఎస్ఎస్ నుండి బిజెపి వైపు చూపుని వెనక్కి తిరగకుండా ఎవరికి ఏ హానీ తలపెట్టలేదని నన్ను ఎందుకు పోలీసులు అడ్డుకున్నారో ఇప్పటికీ కూడా నాకు అర్థం కావటం లేదని దయచేసి నాకు సమాధానం తెలపాలని చైర్మన్ ముందు విన్నవించారు. వాటికి చైర్మన్ జవాబు ఇస్తూ ఎవరైతే వీటికి కారకులు ఉన్నారో వారిపై చట్ట ప్రకారం చర్య తీసుకోవాలని పోలీసు వారికి తెలిపారు. తదనంతరం రంపచోడవరం ఎస్.టి. కమిషన్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున గిరిజనులు పాల్గొనగా భాజపా కార్యకర్తలు మండల అధ్యక్షులు లవుడు శ్రీనివాస్, యామల దొర ,చిట్రా పాపారావు, మాణిక్యం, గంటా గోపి, సుర్ల శ్రీను తదితరులు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

## షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న సిద్ధార్ధ విద్యాలయ విద్యార్ధిని సుకీర్తన



**హనుమాన్ జంక్షన్, జూలై 20 (వార్తాప్రభ) :** హనుమాన్ జంక్షన్‌లోని సిద్ధార్థ విద్యాలయానికి చెందిన విద్యార్థిని బాణావతుల సుకీర్తన 2025–26 విద్యాసంవత్సరానికి సంబంధించిన పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందజేసే ప్రతిష్ఠాత్మక "షైనింగ్ స్టార్ అవార్డు"కు ఎంపికైంది. ఈ సందర్భంగా కృష్ణా జిల్లా కలెక్టర్ శ్రీ బాలాజీ చేతుల మీదుగా సుకీర్తన రూ.20 వేల నగదు పారితోషికం, ప్రశంసాపత్రం (సర్టిఫికేట్) మరియు మెడల్‌ను అందుకుంది. ఈ విశిష్ట విజయంపై సిద్ధార్థ విద్యాలయ చైర్మన్ కోనేరు సురేష్ బాబు విద్యార్థినిని అభినందిస్తూ ప్రత్యేక పురస్కారాన్ని ప్రకటించారు. అలాగే విద్యాలయ ప్రిన్సిపాల్ వి. ధనలక్ష్మి, ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందించి, ఆమె భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## శ్రీనివాసాచార్యుల స్వగృహంలో అయోధ్య స్వర్ణ బాలరామునికి వైభవోపేత విశేష పూజలు





**హనుమాన్ జంక్షన్, జూలై 20 (వార్తాప్రభ) :** ప్రముఖ శ్రీపాంచరాత్ర శాస్త్ర ఆగమ పండితులు, శ్రీమహావిష్ణు లోకకళ్యాణ సమితి ట్రస్ట్ వ్యవస్థాపకులు మారేపల్లి శ్రీనివాసాచార్యుల స్వగృహంలో ఆదివారం అయోధ్య స్వర్ణ బాలరామునికి అత్యంత వైభవంగా విశేష పూజలు నిర్వహించారు. అయోధ్య శ్రీ కళ్యాణ రాముని దేవాలయ వ్యవస్థాపకులు మహారాజశ్రీ చల్లా శ్రీనివాస శర్మ స్వర్ణ బాలరాముని విగ్రహం, పవిత్ర పాదుకలు, ధనుర్బాణాలను తీసుకువచ్చి భక్తులకు దివ్య దర్శనం కల్పిం చారు. ఈ సందర్భంగా వేదమంత్రోచ్చారణల మధ్య సుప్రభాత సేవ, ప్రత్యేక అర్చనలు, పుష్పాలంకరణ, తులసి మాలలతో పూజలు, మహానైవేద్యాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం మంగళహారతి సమర్పిం చి భక్తులకు తీర్థప్రసాదాలు, విశేష ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న చల్లా శ్రీనివాస శర్మ మాట్లాడుతూ అయోధ్యలో నిర్మాణంలో ఉన్న శ్రీ కళ్యాణ రాముని ఆలయ విశేషాలను వివరించారు. మారేపల్లి శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ స్వామివారి పూజా కైంకర్యాలు తమ స్వగృహంలో నిర్వహించే అవకాశం లభించడం దైవానుగ్రహమని, భక్తులందరూ శ్రీరాముని కృపాకటాక్షాలు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గాయత్రీ జ్యువెలర్స్ వ్యవస్థాపకులు తమిరి రమేష్, శివశక్తి రామసేతు ధర్మప్రచారక్ యడవల్లి పాండురంగారావు తదితరులు పాల్గొనగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందితేనే దేశానికి ఉత్తమ భవిష్యత్తు

-- కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు





**కాకినాడ, జూలై 20 (వార్తాప్రభ) :** విద్యార్థులు భవిష్యత్తులో అత్యున్నత స్థానాలకు చేరుకోవాలంటే విద్యతో పాటు నాయకత్వ లక్షణాలు క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన ఆలోచనా విధానం ఎంతో అవసరమని కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు అన్నారు. సోమవారం కాకినాడ నగరంలోని నారాయణ విద్యా సంస్థల పాఠశాలలో ఉత్తమ విద్యార్థి నాయకులు (హెడ్ బాయ్, హెడ్ గర్ల్, హౌస్ కెప్టెన్లు, వైస్ కెప్టెన్లు)గా ఎన్నికైన విద్యార్థులకు బ్యాడ్జీలు, సాష్‌లు, మెడల్స్ ప్రదానం చేసే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తుమ్మల రామస్వామి బాబు విద్యార్థులను అభినందించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాయకత్వం అనేది ఒక పదవి మాత్రమే కాదని, అది బాధ్యతతో కూడిన సేవాభావమని అన్నారు. పాఠశాల దశలోనే నాయకత్వ అవకాశాలు లభించడం విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. నేటి విద్యార్థులే రేపటి సమాజానికి, రాష్ట్రానికి, దేశానికి నాయకులని, అందుకే నిజాయితీ, క్రమశిక్షణ, సేవా దృక్పథం, సమయపాలన వంటి విలువలను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు నైతిక విలువలు, సామాజిక బాధ్యత, జట్టుగా పనిచేసే తత్వాన్ని పెంపొందించుకోవాలని, ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటూ తమ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాన్ని నారాయణ విద్యాసంస్థల లైఫ్ స్కిల్స్ విభాగం, హెచ్‌ఆర్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నారాయణ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఏజీఎం కె. రాఘవేంద్రరావు, పి. రవికుమార్, మోహిని, సుస్మిత రాజ్, మూర్తి, రామ తులసి, సఫోర, పిఠాపురం మార్కెట్ కమిటీ చైర్మన్ వాకాపల్లి దేవి సూర్యప్రకాశ్, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంకే వెంకటేష్, పల్నాటి మధు, వడ్డీ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## న్యాయస్థానం ఆదేశాల ప్రకారం కోర్టు ఆవరణ లో యార్లగడ్డ



**గన్నవరం, జూలై 20 (వార్తాప్రభ) :** న్యాయస్థానం విధించిన షరతుల మేరకు అమెరికా పర్యటన అనంతరం మచిలీపట్నం కోర్టుకు హాజరు కావాల్సి ఉండటంతో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఈరోజు మచిలీపట్నం కోర్టుకు హాజరయ్యారు. గత ప్రభుత్వం రాజకీయ కక్షసాధింపు ధోరణితో నమోదు చేసిన అక్రమ కేసుల విచారణలో భాగంగా, గౌరవ న్యాయస్థానం విధించిన షరతుల మేరకు అమెరికా పర్యటన అనంతరం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు ఈరోజు స్వయంగా కోర్టుకు వచ్చారు. ప్రజల ఆశీర్వాదం, నిజాయితీ, ధర్మం తనకు అండగా ఉన్నాయనే విశ్వాసంతో రాజకీయ కక్షసాధింపు కేసులను ఎదుర్కొంటూ ప్రజాసేవలో మరింత అంకితభావంతో ముందుకు సాగుతామని యార్లగడ్డ వెంకట్రావులి స్పష్టం చేశారు.

## గోశాల నిర్మాణానికి మాదాసు వితరణ



**పెడన, జూలై 20 (వార్తాప్రభ) :** పెడన పట్టణంలో నిర్మాణం జరుగుతున్న శ్రీ లోపాముద్ర గోశాలకు మాదాసు బాబురావు 10,008 రూపాయలు వితరణ చూపారు. ఆయన భార్య రత్నకుమారి జ్ఞాపకార్థం ఈ మొత్తాన్ని అందించారు. అధ్యాత్మిక వేత్త తోట హరిబాబుకు ఈ విరాళాన్ని అందజేశారు. బాబురావు ను పలువురు అభినందించారు.

## యాదవులపై దాడి చేస్తే ప్రతిఘటన తప్పదు..




**గిద్దలూరు, జూలై 20 (వార్తాప్రభ) :** పంచాయతీ కార్యదర్శి రమణయ్య యాదవ్ పై దాడి చేసిన ముద్దాయి లను వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపాలని డిమాండ్ చేస్తూ గిద్దలూరు పోలీస్ స్టేషన్ ముందు ప్రెస్ మీట్ పెట్టిన యాదవ సంఘం నాయకులు, కార్యకర్తలు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుర్రా శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ యాదవ జాతిని చులకనగా అవహేళనగా మాట్లాడిన, యాదవ ఉద్యోగులు మరియు యాదవ సామాజిక వర్గం నకు చెందిన వ్యక్తుల పై దాడి చేసిన ముద్దాయి లను వారిని కూడా ఆరెస్ట్ చేసి రిమాండ్ కు పంపక పోవడము వలన యాదవ కుటుంబ సభ్యుల పై దాడులు ఇంకపెరుగుతున్నాయి. ముద్దాయిలు ను చట్ట పరంగా శిక్షించకపోతే ప్రతి దాడులకు కూడా ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం సిద్ధం. ఈ కార్యక్రమంలో బాధితుడు పంచాయతీ కార్యదర్శి రమణయ్య యాదవ్, వెంకటయ్య యాదవ్, పిరయ్య యాదవ్, మోహన్ యాదవ్, బాలయ్య యాదవ్, మాధవ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## డా.బండారు గిష్మా ను సత్కరించిన యాదవ్ నేతలు



**గిద్దలూరు, జూలై 20 (వార్తాప్రభ) :** డా.బండారు గిష్మా గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి ఉత్తర్వులు తీసుకొని గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలో జాయిన్ అయిన సందర్భంగా గిద్దలూరు యాదవ సంఘం నాయకులు డాక్టర్ ని సత్కరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఓ వెంకటయ్య, జంగాల బాలయ్య, బొంత శ్రీనివాసులు, కే పోలయ్య, జింక వెంకటేశ్వర్లు, మీసాల గోపాల్, బత్తుల తిరుపతయ్య, ఆర్టీసీ నాయకుడు చక్రపాణి, నంద్యాల పేరయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని గిష్మా ని ఘనంగా సత్కరించడం జరిగినది.

## కొమ్మనకు వైద్యరత్న..



**కాకినాడ, జూలై 20 (వార్తాప్రభ) :** గ్రామీణ వైద్యులు వైద్యులు కొమ్మన తాతారావుకు వైద్యరత్న అవార్డు లభించింది. తమిళనాడు పారంపర్య సిద్ధ వైద్య మహా సంఘం రిజిస్టర్ చెన్నై. ఆయుర్వేద పరమ పర్యా మహా సిద్ధ డాక్టర్ ఎస్. శుభానందన్.(చైర్మన్) డాక్టర్ ఎస్. ఆర్. జయప్రకాష్ (కో చైర్మన్), సిహెచ్ చంద్రశేఖర్ వారి బృందం వైద్యరత్న అవార్డు గ్రహీత గ్రామీణ వైద్యులు కొమ్మన తాతారావుకు అవార్డు అందించారు. తాతా రావు మాట్లాడుతూ అవార్డు రావడం ఆనందంగా ఉందని అన్నారు.

# “విపత్తు ఎప్పుడు, ఎంత తీవ్రతతో సంభవిస్తుందో ఖచ్చితంగా అంచనా వేయగలగటమే కీలకం” - ఆర్.పీ. సిసోడియా

● ముందస్తు ప్రణాళిక, సన్నద్ధతే ప్రాణ, ఆస్తి నష్టాల నుండి విముక్తి

● విపత్తు నిర్వహణ సంస్థల పరస్పర సమన్వయంతోనే ఆశించిన ఫలితాలు



**మంగళగిరి,జూలై 20 (వార్తాప్రభ) :** “విపత్తు ఎప్పుడు సంభవిస్తుంది, ఎంతసేపు కొనసాగుతుంది, దాని తీవ్రత ఎంత ఉంటుందో ముందుగానే ఖచ్చితంగా అంచనా వేయడం సమర్థవంతమైన విపత్తు నిర్వహణకు మూలాధారం. విపత్తు వచ్చిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు ప్రణాళిక, సన్నద్ధతే ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గిస్తుంది” అని పరిశ్రమలు, వాణిజ్యం (చేనేత & జౌళి) శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పీ. సిసోడియా పేర్కొన్నారు. మంగళగిరిలోని ఆంధ్రప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఏపీఎచ్ఆర్డీఐ)లో శిక్షణ పొందుతున్న ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లకు విపత్తు నిర్వహణ అంశంపై ఆయన సోమవారం ప్రత్యేక ఉపన్యాసం ఇచ్చారు. విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలంటే ముందుగానే అవసరమైన సిబ్బంది, యంత్రాలు, సామగ్రిని సమీకరించేందుకు కార్యాచరణ సిద్ధంగా ఉండాలని సిసోడియా సూచించారు. ప్రమాద సూచనలు అందిన వెంటనే ప్రజలకు వేగంగా సమాచారం చేరవేయడం, ప్రమాద ప్రాంతాల్లో నివసించే వారిని అప్రమత్తం చేయడం, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు తరలించడం వంటి చర్యలు అత్యంత కీలకమని తెలిపారు. విపత్తు సంభవించిన అనంతరం సహాయక చర్యలు, పునరావాసం, మౌలిక వసతుల పునరుద్ధరణ వేగంగా చేపట్టాలని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలు, జిల్లా యంత్రాంగం, విపత్తు నిర్వహణ సంస్థలు పరస్పర సమన్వయంతో పనిచేస్తేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని సిసోడియా అన్నారు. ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధస్సు (ఏఐ), ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), ఆధునిక టెలికమ్యూనికేషన్ వ్యవస్థలు, డ్రోన్లు వంటి సాంకేతిక పరిజ్ఞానం విపత్తుల ముందస్తు అంచనా, పరిస్థితుల పర్యవేక్షణ, నష్టం అంచనా, సహాయక చర్యల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయని వివరించారు. ఆంధ్రప్రదేశ్‌లో సంభవించిన వివిధ ప్రకృతి వైపరీత్యాల అనుభవాలను ప్రస్తావిస్తూ ఇటీవల సంభవించిన విజయవాడ వరదల నిర్వహణపై ప్రత్యేకంగా వివరించారు. అలాగే రాష్ట్రాన్ని తరచూ ప్రభావితం చేసే తుఫాన్లు, వరదలు, కరువు పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రభుత్వం తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, పరిపాలనా విధానాలపై అవగాహన కల్పించారు. గోదావరి పుష్కరాల సందర్భంగా ప్రత్యేక అధికారిగా పనిచేసిన అనుభవాన్ని కూడా ఆయన శిక్షణార్థులతో పంచుకున్నారు. లక్షలాది మంది భక్తులు పాల్గొనే భారీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలంటే ముందస్తు ప్రణాళిక, శాఖల మధ్య సమన్వయం, వనరుల సమర్థ వినియోగం ఎంత ముఖ్యమో వివరించారు. ఏపీఎచ్ఆర్డీఐ నిర్వహిస్తున్న 12 వారాల ఇండక్షన్ శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ ఉపన్యాసం జరిగింది. ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్లు ఈ శిక్షణలో పాల్గొంటున్నారు.

# పేరుకే స్వర్ణ పంచాయితీలు..!

## ఆకలి కేకలు పెడుతున్న కాంట్రాక్టు సిబ్బంది

● 4నెలలుగా జీతాలకోసం ఎదురు చూపు....! ● అప్పులు చేసి కుటుంబాలను పోషించు కుంటున్న పారిశుద్ధ్య కార్మికులు ● ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్న స్వర్ణ పంచాయితీల కాంట్రాక్టు సిబ్బంది



స్వర్ణ పంచాయతీలుగా చెప్పుకుంటున్న గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బంది ఆకలి కేకలు పెడుతున్నారు.వీరికి నెలలు తరబడి వేతనాలు అందక కుటుంబాలు పస్తులు ఉండాల్సిన పరిస్థితి నెలకుంది.జీతాల కోసం నెలల తరబడి ఎదురు చూస్తున్నారు. ఇంటిలో పూటగడవటమే కష్టంగా మారడంతో వడ్డీ వ్యాపారస్తులను ఆశ్రయించి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి.వీరు జీతాల కోసం ఎదురు చూడని రోజులేదని చెప్పడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు.




**జి.కొండూరు/మైలవరం,జూలై 20 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లా, జి.కొండూరుమరియు మైలవరం మండల పరిధిలోని స్వర్ణ గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు సిబ్బందికి 4 నెలలుగా జీతాలు అందక అవస్థలు పడుతున్నారు. స్వర్ణాంధ్ర,స్వచ్ఛ ఆంధ్ర,స్వచ్ఛ పథం కార్యక్రమాల లో పారిశుద్ధ్య కార్మికులు కీలక పాత్ర పోషిస్తున్నా రు.ఇంటింటికి తిరిగి తడి-చెత్త పొడి చెత్తను సేకరించడంతో పాటు గ్రామాలలో కంపు కొడుతున్న డ్రైనేజీలను శుభ్రపరచడం వంటి పనులు చేస్తుంటారు.ఈ పనులు అందరూ చేయలేరు.వీరు చేస్తున్న పనులకు తగిన వేతనాలు లేవు.అయినా చాలీచాలని జీతాలతో కాలం వెల్లదీస్తున్నారు.మరోవైపు రాష్ట్రప్రభుత్వం గ్రామ పంచాయితీకి వచ్చే నిధుల్లో నుంచి ముందుగా పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు చెల్లించాలని ఆదేశాలు ఉన్నప్పటికీ సంబంధిత జిల్లా అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా కాంట్రాక్ట్ కార్మికులకు నెలల తరబడి జీతాలు ఇవ్వడంలేదు.దీంతో పారిశుద్ధ్య కార్మికులు ఎక్కువ వడ్డీలకు అప్పులు చేసి కుటుంబాలను పోషించుకునే పరిస్థితి నెలకొంది.వేతనాలు అందక తమ పిల్లలకు మూడు పూటలా సరైన ఆహారం కూడా అందించలేని పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పిల్లలు స్కూల్ ఫీజులు, పుస్తకాలు కొనేందుకు కూడా ఇబ్బంది పడుతున్నామని స్వర్ణ పంచాయితీ పరిస్థితి కార్మికులు వాపోతున్నారు.జి.కొండూరు మండలంలో 22,మైలవరం మండలంలో 13 స్వర్ణ పంచాయితీలు ఉన్నాయి.ఈ స్వర్ణ పంచాయతీలలో పనిచేసే కాంట్రాక్టు సిబ్బంది తక్షణమే జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకొని మా కుటుంబాలను ఆదుకోవాలని ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు.



# పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు ప్రజలకు భరోసాగా నిలవాలి

● పరిష్కరించిన ఫిర్యాదు తిరిగి పునరావృతం కాకూడదు ● ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహించే అధికారులపై చర్యలు తప్పవు ● సత్వర, నాణ్యమైన పరిష్కారమే ప్రజల సంతృప్తికి కొలమానం ● జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ



**విజయవాడ,జూలై 20 (వార్తాప్రభ) :** ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి, ఫిర్యాదుదారులకు భరోసా కల్పించాలని జిల్లా కలెక్టర్ డా.లక్ష్మీశ ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో పెండింగ్, పరిష్కరించిన ఫిర్యాదులపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ డా.లక్ష్మీశ మాట్లాడుతూ ఒకసారి పరిష్కారం చూపిన ఫిర్యాదు తిరిగి ప్రారంభమయ్యే పరిస్థితి రాకుండా శాశ్వత పరిష్కారం అందించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారం కేవలం నామమాత్రంగా కాకుండా ఫిర్యాదుదారుడు పూర్తిగా సంతృప్తి చెందే విధంగా ఉండాలన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించలేని పరిస్థితుల్లో కారణాలను స్పష్టంగా వివరించి అర్జీదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి అర్జీని పూర్తిగా పరిశీలించి, అవసరమైతే క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించి నాణ్యమైన పరిష్కారం అందించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్న కలెక్టర్, ప్రజలు ప్రభుత్వంపై నమ్మకంతో తమ సమస్యలను తీసుకొస్తున్నందున వాటిని తమ సమస్యలుగా భావించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం, అలసత్వం ప్రదర్శించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈరోజు నిర్వహించిన పిజిఆర్ఎస్ సమావేశం ద్వారా 251 అర్జీలను స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు.

**పీజీఆర్ఎస్ సేవలపై క్యూ.ఆర్ కోడ్ ద్వారా ప్రజాభిప్రాయం..** ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థలో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం క్యూ.ఆర్ కోడ్ ఆధారిత ఫీడ్‌బ్యాక్ విధానాన్ని అమలు చేస్తోందని కలెక్టర్ డా.లక్ష్మీశ తెలిపారు. జిల్లా, మండల స్థాయి పీజీఆర్ఎస్ కేంద్రాలు, హెల్ప్‌డెస్క్‌లు, ఫిర్యాదుల కౌంటర్లు, నోటీసు బోర్డులు తదితర ప్రదేశాల్లో క్యూ.ఆర్ కోడ్‌ను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ప్రజలు సేవలు పొందిన వెంటనే తమ మొబైల్ ఫోన్ ద్వారా క్యూ.ఆర్ కోడ్‌ను స్కాన్ చేసి సేవలపై తమ అభిప్రాయాన్ని తెలియజేయవచ్చన్నారు. ఈ విధానం ద్వారా ప్రజల సంతృప్తి స్థాయిని అంచనా వేసి సేవల నాణ్యతను మరింత మెరుగుపరుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎం.లక్ష్మీనరసింహ, పి జి ఆర్ ఎస్ నోడల్ అధికారి జి.జ్యోతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఈ నెల 21 నుంచి ప్రత్యేక ఆధార్ శిబిరాలు

● ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, జూలై 20 (వార్తాప్రభ) :** ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు జిల్లాలో ప్రత్యేక ఆధార్ సేవా శిబిరాలు అందుబాటులో ఉంటాయని.. ప్రజలు వీటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు కార్యాలయాలతో పాటు ప్రభుత్వ పాఠశాల లు, కళాశాలల్లో ఈ శిబిరాలు సేవలందిస్తాయన్నారు. కొత్తగా ఆధార్ నమోదు, ఆధార్‌లో పేరు, చిరునామా, జనన తేదీ, మొబైల్ నంబరు, బయోమెట్రిక్ వివరాల నవీకరణతో పాటు 5 నుంచి 15 ఏళ్లు, ఆ పైబ డిన చిన్నారుల బయోమెట్రిక్ అప్‌డేట్ తదితర సేవలను పొందొచ్చ న్నారు. ప్రజలకు సకాలంలో పారదర్శకంగా ఆధార్ సేవలు అందించేం దుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రధానంగా విద్యార్థులకు ఆధార్ సేవలు తేలిగ్గా అందుబాటులో ఉండేలా పాఠశాలలు, కళాశాలల్లోనూ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు.

# షైనింగ్ స్టార్ విజేతకు బహుమతి ప్రధానం




**కృత్తివెన్ను,జూలై 20 (వార్తాప్రభ) :** బంటుమిల్లి స్థానిక సెయింట్ జాన్స్ స్కూల్ పదవ తరగతి విద్యార్థిని అర్థాన్ని లలిత కుమారి సైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైన విషయం అందరికీ తెలిసినదే. సోమవారం ఉదయం జెడ్పీ ఫంక్షన్ హాల్ నందు కలెక్టర్ డి కె బాలాజీ ఆర్ టీ సి చైర్మన్ కొనకళ్ళ నారాయణ డీ ఈ వో సుబ్బారావు చేతుల మీదుగా 20 వేల రూపాయల చెక్కు ప్రశంసా పత్రం మెడల్ అందుకోవడం జరిగింది అని ఈ సందర్భంగా కరస్పాండెంట్ సాబూ జాన్ మరియు ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ సాబు ఉపాధ్యాయనీ ఉపాధ్యాయులు అభినందించడం జరిగినది.

# పూర్వ విద్యార్థి సహకారంతో క్రీడా మైదానం అభివృద్ధి



**హనుమాన్ జంక్షన్,జూలై 20 (వార్తాప్రభ) :** అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం పల్లంగా ఉండటంతో విద్యార్థులు క్రీడలు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు పూర్వ విద్యార్థి, దాత మొవ్వా రమేష్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన మొవ్వా రమేష్ సుమారు 15 టిప్పర్ల రబ్బిష్‌ను మైదానానికి తరలించి, స్థలాన్ని మెరక చేయించారు. దీంతో విద్యార్థులు సురక్షితంగా క్రీడలు నిర్వహించుకునే పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు, కమిటీ సభ్యులు దాత మొవ్వా రమేష్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, పాఠశాల అభివృద్ధికి ఆయన అందించిన సహకారం అభినందనీయమని పేర్కొన్నారు.అవసరమైతే దీనికి ఆకర్షణీయమైన పత్రిక హెడ్డింగ్‌లు కూడా సూచించగలను.

# పెడనలో జగనన్న 2.0 యాప్ పోస్టర్ ఆవిష్కరణ




**పెడన,జూలై 20 (వార్తాప్రభ) :** జగనన్న 2.0 యాప్ గోడ పత్రికను వైసీపీ నియోజకవర్గం ఇంచార్జ్ ఉప్పాల రాము ఇతర నాయకులు సోమవారం నాడు ఆవిష్కరించారు. పట్టణం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నందు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగనన్న 2.0 యాప్ పోస్టర్ను ఆవిష్కరించిన అనంతరం రాము మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దావు భైరవలింగం కటకం ప్రసాద్ వన్నెంరెడ్డి మహంకాలరావు మాదాసు బాబురావు బళ్ళ గంగయ్య బండారు మల్లి కొండవీటి నాగబాబు జయేష్ మెట్ల గోపి కార్యకర్తలు పాల్గొన్నారు...

# నేటి నుంచి దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్



**అమలాపురం,జూలై 20 (వార్తాప్రభ) :** అమలాపురం సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ సేవలను, దస్తావేజుల తయారీ విధానాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తూ జారీ చేసిన జి.ఓ.నెం:396 ను రద్దు చేయాలని దస్తావేజు లేఖర్లు డిమాండు చేశారు. ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని దస్తావేజు లేఖరులం దరూ నిరసన వ్యక్తం చేస్తున్నారని, ఇందులో భాగంగా అమలాపురం సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద పెన్ డౌన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామనీ, 20 వ తేదీ నుంచి 31 వరకు నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని దస్తావేజు లేఖర్లు సంఘం నాయకులు తెలిపారు. రాష్ట్రంలో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేటీకరించే చర్యలను నిలిపివేయాలని, జి.ఓ. నెం.396ను రద్దు చేయాలని, దస్తావేజు లేఖర్లకు ఉపాధి భరోసా కల్పించాలని డిమాండు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని విస్తరించేందుకు తీసుకుంటున్న నిర్ణయాలు వేలాది మంది దస్తావేజు లేఖర్ల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం చూపనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా ప్రజలకు సేవలందిస్తూ వస్తున్న దస్తావేజు లేఖర్ల వృత్తి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. దస్తావేజుల తయారీ, నమోదు ప్రక్రియలో ప్రైవేట్ సంస్థలకు బాధ్యతలు అప్పగించడం వల్ల సంప్రదాయంగా ఈ వృత్తిపై ఆధారపడిన లేఖర్లకు ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయని వారు తెలిపారు. ఇప్పటికే అనేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న లేఖర్ల కుటుంబాలు ఈ నిర్ణయంతో మరింత సంక్షోభంలోకి వెళ్లే ప్రమాదం ఉందన్నారు. గతంలో దస్తావేజు లేఖర్ల లైసెన్సుల వ్యవస్థలో జరిగిన మార్పుల కారణంగా అనేక మంది లేఖర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ప్రస్తుతం ఆ లైసెన్సులను పునరుద్ధరించి చట్టబద్ధమైన గుర్తింపు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో అమలాపురం దస్తావేజు లేఖర్ల సంఘ అధ్యక్షులు జున్నూరి సురేష్, కన్వీనర్ మట్టపర్తి రాము, గౌరవ అధ్యక్షులు గుంటు ఫణిప్రసాద్, సెక్రటరీ పందిరి హరి, జాయింట్ సెక్రెటరీ పెద్దిరెడ్డి దుర్గేష్, వెదులపల్లి సుబ్బు, గనిశెట్టి బోగిరాజు, బొమ్మరాజు, అడపా భూషణం,బొర్రా బుజ్జి, కడలి సత్య నారాయణ, డేగల రాజా, గోపాలం, సిరిపల్లి మూర్తి, పృథ్వి శ్రీను, గుమ్మల నరేష్, బండ్రెడ్డి రాజు, శివ,బుజ్జి, భూషణం, గుప్పి,రాజబాబు, కె.వి.నాగరాజు సహాయకులు, టైపిస్ట్తతదితర సంఘ సభ్యులు తదితరులు పాల్గున్నారు.

# చైతన్య కళాశాలలో సైబర్ నేరాలు -- పోక్సో చట్టంపై అవగాహన సదస్సు

–ఆన్లైన్ మోసాలకు 1930 సైబర్ హెల్ప్ లైన్ కు ఫిర్యాదు చేయండి





**నందిగామ,జూలై 20 (వార్తాప్రభ) :** నందిగామ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని చైతన్య కళాశాలలో విద్యార్థినీ, విద్యార్థులలో చట్టాలపై అవగాహన పెంపొందించడం, సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తం చేయడం, బాలల రక్షణకు సంబంధించిన లిపోక్సో చట్టంలి గురించి సమగ్ర అవగాహన కల్పించడం లక్ష్యంగా సోమవారం ప్రత్యేక అవగాహన సదస్సును ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విజయవాడ రూరల్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ బి. లక్ష్మీనారాయణ, ఐపీఎస్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. నేటి సాంకేతిక యుగంలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ సోషల్ మీడియా, మొబైల్ ఫోన్లు, ఆన్‌లైన్ బ్యాంకింగ్, యూపీఐ లావాదేవీలు, ఓటీపీలు, అనుమానాస్పద లింకులు, నకిలీ ఉద్యోగాలు, ఆన్‌లైన్ గేమింగ్, డిజిటల్ అరెస్టు, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాల వినియోగంలో అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల మాటలు నమ్మి వ్యక్తిగత వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీలు, పాస్‌వర్డ్లు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరికీ చెప్పకూడదని, ఏదైనా మోసానికి గురైతే వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్కు ఫిర్యాదు చేయాలని, అలాగే [www.cybercrime.gov.in] (http://www.cybercrime.gov.in) పోర్టల్ ద్వారా కూడా ఫిర్యాదు నమోదు చేయవచ్చని వివరించారు.18 సంవత్సరాల లోపు బాలబాలికలపై జరిగే లైంగిక వేధింపులు, అసభ్య ప్రవర్తన, సోషల్ మీడియా ద్వారా వేధింపులు, అసభ్య ఫోటోలు లేదా వీడియోలు పంపించడం, బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చేయడం వంటి ప్రతి చర్య చట్టరీత్యా తీవ్రమైన నేరమని తెలిపారు. విద్యార్థులు సోషల్ మీడియాలో పరిచయమైన అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత సమాచారం పంచుకోవద్దని, వ్యక్తిగత ఫోటోలు, వీడియోలు పంపవద్దని, ఎవరైనా వేధింపులకు పాల్పడినా లేదా బ్లాక్‌మెయిల్ చేసినా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సూచించారు.ఈ సందర్భంగా నందిగామ డివిజన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సి హెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని మంచి అలవాట్లు పెంపొందించుకోవాలని, చట్టాలను గౌరవిస్తూ బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించకుండా ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి అనుమానాస్పద సంఘటన జరిగినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నందిగామ టౌన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పై. శ్రీను మాట్లాడుతూ విద్యార్థులు సోషల్ మీడియాను సద్వినియోగం చేసుకోవాలని, అపోహలు, తప్పుడు ప్రచారాలు, నకిలీ సందేశాలను నమ్మకూడదని, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. విద్యార్థులు తమ స్నేహితులను కూడా చట్టాలపై అవగాహన కల్పించే బాధ్యత తీసుకోవాలని అన్నారు.నందిగామ ఎస్ఐ వి. మహతి పోక్సో చట్టంలోని ముఖ్య నిబంధనలు, బాలల హక్కులు, మహిళల భద్రత, ఆన్‌లైన్ వేధింపుల నివారణ, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఎలా సంప్రదించాలో విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే విధంగా వివరించారు. విద్యార్థినులు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా పోలీసులను సంప్రదిస్తే వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో చైతన్య కళాశాల ప్రిన్సిపాల్ ఎ రమేష్ మాట్లాడుతూ విద్యార్థులకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా సమాజంలో చట్టాలపై అవగాహన పెరగడంతో పాటు నేరాల నివారణకు కూడా ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన నందిగామ పోలీసు అధికారులకు కళాశాల యాజమాన్యం తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ అవగాహన సదస్సులో కళాశాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థినీ, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని సైబర్ నేరాలు, పోక్సో చట్టం, మహిళల భద్రత, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చట్టపరమైన రక్షణ అంశాలపై పలు సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188